
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



5 జనగామ

మంగళవారం 30 జూలై 2024

పాఠశాలల్లో ప్రయోగాత్మక విద్య



టెలిస్కోప్ ద్వారా గ్రహాలు, నక్షత్రాలు చూస్తున్న విద్యార్థులు



త్రీడీ ప్రింటర్



- జిల్లాలో 12 హైస్కూళ్లలో ఏర్పాటు
- సాంకేతిక పరికరాలతో సైన్స్ బోధన
- అందుబాటులో ప్రొజెక్టర్, రోబో, త్రీడీ ప్రింటర్, టెలిస్కోప్

'అటల్ టింకరింగ్' పేరిట ఆధునిక ప్రయోగశాలలు

స్టేషన్‌ఘన్‌పూర్ టౌన్, జూలై 29: శివునిపల్లి, ఘన్‌పూర్ హైస్కూళ్లలో ఉన్న ఆధునిక ల్యాబ్‌లోకి అడుగు పెడితే పాలిటెక్నిక్ లేదా ఇంజనీరింగ్ కళాశాలలోకి అడుగు పెట్టిన అనుభూతి కలుగుతుంది. అక్కడ ఉన్న విశాలమైన ప్రయోగశాల, ఆధునిక పరికరాలు అందరినీ ఆశ్చర్య పరుస్తాయి. గ్రామీణ విద్యార్థులకు సైన్స్ పట్ల ఆసక్తిని పెంచి భవిష్యత్తులో నూతన ఆవిష్కరణలకు బాటలు వేసి భావి శాస్త్రవేత్తలుగా తయారు చేస్తాయని నమ్మకం కలుగజేస్తున్నాయి. అవే అటల్ టింకరింగ్ ల్యాబ్‌లు.

తరగతి గదిలో సైన్స్, గణిత పాఠాలు బోధిస్తున్న సమయంలో పాఠ్య పుస్తకంలో ఉన్న విషయం చదివి చెబుతూ పోతే విద్యార్థులకు అంతంత మాత్రంగానే అర్థం అవుతుంది. అదే పాఠం ప్రయోగాత్మకంగా చేసి చూపితే విద్యార్థులు ఆనందంగా, ఆసక్తిగా, ఉత్సాహంగా నేర్చుకుంటారు. ఇక అత్యాధునిక సాంకేతిక పరికరాలతో బోధిస్తే విద్యార్థుల మస్తిష్కాలకు మరింత పదును పెట్టినట్టే. నూతన ఆలోచనలు, ఆవిష్కరణలకు శ్రీకారం చుడతారు. విద్యార్థుల్లో జిజ్ఞాసను, పరిశోధనాబిలాషను పెంచుకుంటారు. ఇదే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం అటల్ టింకరింగ్ ల్యాబ్‌లను ఏర్పాటు చేసింది. హైస్కూళ్లలో 400మంది విద్యార్థులు, 1500చదరపు అడుగుల గది అందుబాటులో ఉన్న స్కూళ్లను అటల్ ల్యాబ్ కోసం ఎంపిక చేశారు. 2021లో జనగామ జిల్లాకు 12 టింకరింగ్ ల్యాబ్‌లు కేటాయించగా ఒక్కోటి రూ.12 లక్షల వ్యయంతో ఏర్పాటు చేశారు. ఈ మొత్తంతో మొదటి విడత రూ.7 లక్షలతో ప్రొజెక్టర్, త్రీడీ ప్రింటర్, రోబో, టెలిస్కోప్, మెటీరియల్ అందించారు. మిగతా రూ.5 లక్షలతో మూడు హైఫై ల్యాప్‌ట్యాప్‌లు, ఫర్నిచర్, ప్రాజెక్టుల నిర్వహణకు అవసరమైన సాఫ్ట్‌వేర్ సమకూర్చారు. విద్యార్థులు, సైన్స్, గణిత ఉపాధ్యాయులకు ల్యాబ్ వినియోగంపై మూడు రోజులు శిక్షణ కూడా ఇచ్చారు. ల్యాబ్‌లో విద్యార్థులకు ఆధునిక శాస్త్ర, సాంకేతిక, సైన్స్ అంశాల పట్ల సులభంగా అవగాహన కల్పిస్తారు. 1200ప్రాజెక్టుల తయారీకి అవసరమైన మెటీరియల్‌ను కూడా ల్యాబ్‌లో సిద్ధం చేశారు. స్టేషన్ ఘన్‌పూర్, శివునిపల్లి హైస్కూళ్లలో 2022 జనవరిలో ఎమ్మెల్యే డాక్టర్ టి.రాజయ్య ఈ ల్యాబ్‌లను ప్రారంభించారు.

ప్రయోగాల ద్వారా ఎక్కువ నేర్చుకోవడం..

అటల్ టింకరింగ్ ల్యాబ్‌ల ఏర్పాటు ప్రధాన ఉద్దేశం పిల్లలు సైన్స్, గణిత అంశాలు కేవలం వినడం, చూడడం ద్వారా కాకుండా ప్రయోగాత్మకంగా నిరూపించడం. తద్వారా విద్యార్థుల్లో ఆసక్తి పెరుగుతుంది. ఆధునిక పరికరాలతో శాస్త్ర, సాంకేతిక, ఇంజనీరింగ్, గణిత అంశాలపై అవగాహన పెంచుకుంటారు. సైన్స్ ఎలక్ట్రానిక్స్, రోబోటిక్స్, ఓపెన్ సోర్స్ మైక్రో కంప్యూటర్ బోర్డ్స్, సెన్సార్స్, త్రీడీ ప్రింటర్స్ కంప్యూటర్, ల్యాప్ ట్యాప్‌ల వినియోగంపై అవగాహన పెంచుకుంటారు. వీడియో కాన్ఫరెన్స్, జూమ్ మీటింగ్స్ ద్వారా దేశ, విదేశాల్లోని విద్యార్థులతో నూతన ఆలోచనలను పంచుకుంటారు. తద్వారా ప్రాంతీయ, జాతీయ స్థాయి శాస్త్ర, సాంకేతిక పోటీల్లో, ప్రదర్శనలు, వర్క్ షాపుల్లో పాల్గొంటారు.

జిల్లాకు 12 ల్యాబ్‌లు మంజూరు

జిల్లావ్యాప్తంగా 12 హైస్కూళ్లలో అటల్ టింకరింగ్ ల్యాబ్‌లు అందుబాటులోకి వచ్చాయి. స్టేషన్‌ఘన్‌పూర్, శివునిపల్లి, పాలకుర్తి, పడమటి కేశవాపూర్, బచ్చన్నపేట, లింగాలఘణపురం, కొడకండ్ల, జనగామ సెయింట్ పాల్స్ ప్రైవేటు స్కూల్, దేవరుప్పుల సాయి ప్రశాంతి స్కూల్, జనగామ ఏకశిల స్కూల్, టీఎస్ఎంఎస్ నర్మెట, జఫర్‌గడ్ హైస్కూళ్లలో ఈ ల్యాబ్‌లను ఏర్పాటు చేశారు.



శివునిపల్లి పాఠశాలలో ఏర్పాటు చేసిన ల్యాబ్

బాగా అర్థం అవుతున్నాయి



జె.రాంచరణ్, 9వ తరగతి విద్యార్థి, శివునిపల్లి

ల్యాబ్ వల్ల సైన్స్, గణితం, ఖగోళ పాఠాలు సులభంగా అర్థం అవుతున్నాయి. పాలిటెక్నిక్, ఇంజనీరింగ్ కళాశాలలో మాదిరిగా ఆధునిక పరికరాలతో ల్యాబ్ అందుబాటులో ఉండడం ఎంతో ఆనందంగా ఉంది. వాటితో ప్రయోగాలు చేస్తుంటే మనం కూడా కొత్త ఆలోచనలు, ప్రాజెక్టులు చేయాలన్న ఆలోచన వస్తున్నది.

భావి శాస్త్రవేత్తలుగా ఎదగవచ్చు..

- టి.శ్రీనాథ్, ల్యాబ్ ఇన్‌చార్జి, శివునిపల్లి హైస్కూల్



అటల్ టింకరింగ్ ల్యాబ్‌లతో విద్యార్థులు నూతన భావి శాస్త్రవేత్తలుగా ఎదగవచ్చు. ఆధునిక పరికరాలతో ప్రయోగాలు చేయడం వల్ల నూతన ఆలోచనలు, ఆవిష్కరణలకు బాటలు వేసుకోవచ్చు. ల్యాబ్ వినియోగంపై విద్యార్థులకు 3 రోజులు శిక్షణ ఇచ్చారు. ప్రభుత్వం ల్యాబ్ నిర్వహణ, పరికరాల మరమ్మతు కోసం ఏటా 2 లక్షల రూపాయలు మంజూరు చేస్తుంది.

అందరూ ఉపయోగించుకోవాలి

- జి.కొమురయ్య, ఎంఎన్‌వో, ఘన్‌పూర్



జిల్లాలో 400 విద్యార్థుల సంఖ్య ఉన్న హైస్కూళ్లను ల్యాబ్ ఏర్పాటు కోసం ఎంపిక చేశారు. ఐతే ఈ ల్యాబ్‌లను ఆ స్కూల్ విద్యార్థులే కాకుండా చుట్టు పక్కల ఉన్న పీఎస్, యూపీఎస్, హైస్కూళ్ల విద్యార్థులు కూడా వినియోగించకోవచ్చు. వాటిలో ఉన్న ఆధునిక సైన్స్ పరికరాలు, సెన్సార్లు, రోబో, త్రీడీ ప్రింటర్, టెలిస్కోప్ తదితరాలను పరిశీలించవచ్చు. విజ్ఞానాన్ని పెంపొందించుకోవచ్చు.



పాలకుర్తిలో మాట్లాడుతున్న దయాకర్‌రావు

ఊపిరున్నంత వరకు బీఆర్ఎస్‌లోనే ఉంటా

- ఆరు గ్యారంటీలతో కాంగ్రెస్ ప్రజలను మోసం చేసింది
- మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

పాలకుర్తి, జూలై 29: అధికారం ఉన్నా లేకున్నా ఊపిరున్నంత వరకు బీఆర్ఎస్‌లోనే ఉంటానని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు స్పష్టం చేశారు. సోమవారం ఆయన బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. గత ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అమలు కాని హామీలిచ్చి ప్రజలను మోసం చేసిందని విమర్శించారు. ఆరు గ్యారంటీలను నమ్మి ప్రజలు ఓట్లేశారని, ఎనిమిది నెలలు అవుతున్న హామీలు అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని అన్నారు. సోషల్ మీడియాలో తనపై వస్తున్న అపోహలు నమ్మవద్దని, పార్టీ మారే ప్రసక్తే లేదని, ఊపిరున్నంత వరకు బీఆర్ఎస్ పార్టీలోనే ఉంటానని అన్నారు. త్వరలో నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో పర్యటిస్తానని అన్నారు. కార్యకర్తలకు ఎల్లవేళలా అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను ఎప్పటికప్పుడు ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. సమావేశంలో నాయకులు నవీన్, నాగిరెడ్డి, శ్రీనివాసరావు, మాచెర్ల ఎల్లయ్య, కారుపోతుల వేణు, మాటూరి యాకయ్య, పాము శ్రీనివాస్ పాల్గొన్నారు.

నేడు రెండో విడత రుణమాఫీ

- రూ.1.50లక్షల లోపు వారి ఖాతాల్లోకి నిధులు

జనగామ, జూలై29 (ఆంధ్రజ్యోతి): రైతులకు ప్రభుత్వం మరో శుభవార్త అందించింది. రెండో విడత రుణమాఫీ చేస్తూ నిర్ణయం తీసుకుంది. ఈనెల 18న మొదటి విడత రుణమాఫీని రైతుల ఖతాల్లో జమచేసిన ప్రభుత్వం మంగళవారం రెండో విడత మాఫీ చేయనుంది. మొదటి విడతలో భాగంగా రూ. లక్ష లోపు ఉన్న రుణాలను మాఫీ చేయగా రెండో విడతలో రూ. 1.50 లక్షల లోపున్న రుణాలు మాఫీ కానున్నాయి. రెండో విడతలో భాగంగా 17,310 మంది రైతులకు రూ. 180.99 కోట్లు మాఫీ కానున్నాయి.

రైతుల సమక్షంలో రుణమాఫీ ప్రక్రియ

రెండో విడత వ్యవసాయ రుణమాఫీని సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా విడుదల చేయనుండగా కలెక్టరేట్‌లో రైతుల సమక్షంలో మంగళవారం మధ్యాహ్నం జిల్లాకు చెందిన రైతుల సమక్షంలోనే రుణమాఫీ ప్రక్రియను చేపట్టనున్నట్లు జిల్లా వ్యవసాయాధికారి వినోద్‌కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతులు, వ్యవసాయశాఖాధికారులు, సహకార శాఖాధికారులు, బ్యాంకర్లు పాల్గొననున్నట్లు ఆయన తెలిపారు.

శిల్పారామం ఏర్పాటెప్పుడు?

- పద్నాలుగేళ్ల క్రితం మంజూరు
- రూ.6కోట్లు ఇచ్చినా ముందుకు పడని అడుగు
- పట్టించుకోని గత బీఆర్ఎస్ సర్కార్
- స్థలం ఎంపికపైనే ఎడతెగని తకరారు
- ప్రస్తుత ప్రభుత్వమైనా చొరవ తీసుకోవాలంటున్న నగరవాసులు

7 లో..

రీ వాల్యుయేషన్ ఫలితాల కోసం ఎదురుచూపులు

- కేయూ డిగ్రీ సెమిస్టర్ విద్యార్థుల హైరానా
- నిర్ణీత గడువు ముగిసినా ఫలితాల ఊసేలేదు

7లో..

స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధం కండి

మాజీ ఎమ్మెల్యే రాజారెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే రాజారెడ్డి

జఫర్‌గడ్, జూలై 29: రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ అభ్యర్థులను గెలిపించుకోవడానికి కార్యకర్తలు సన్నద్ధం కావాలని సీపీఐ జిల్లా కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే రాజారెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం ఆయన ఉప్పుగల్లు గ్రామంలో నిర్వహించిన సీపీఐ కౌన్సిల్ సమావేశంలో మాట్లాడారు. కేంద్రంలో మోదీ తన స్థానాన్ని కాపాడుకునేందుకు కేవలం రెండు రాష్ట్రాలకే అధికమొత్తంలో నిధులు మంజూరు చేశారని, ఇతర రాష్ట్రాల బాగోగులను గంగలో కలిపారని మండిపడ్డారు. పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన బడ్జెట్ కేవలం సంపన్నుల కోసమేనని, పేదలను, ప్రభుత్వ రంగాన్ని గాలికి వదిలేశారని అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చి హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి సాయన్న, పాతూరి సుగుణమ్మ, జువారి రమేష్, గట్టుమల్లు, కూరపాటి చంద్రమౌళి, సమ్మయ్య, దూడయ్య, బుచ్చయ్య, జాఫర్, కలకోట ప్రభాకర్, యాదగిరి, అజయ్, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

చోరీ ఘటనలో ఒకరి అరెస్టు



పాలకుర్తిలో నిందితుడిని చూపుతున్న సీఐ మహేందర్‌రెడ్డి, పోలీస్ అధికారులు

పాలకుర్తి, జూలై 29 : పాలకుర్తిలో నాలుగు రోజుల క్రితం ఓ కిరాణం దుకాణంలో దొంగతనం చేసిన వ్యక్తిని పోలీసులు సోమవారం అరెస్టు చేసి రిమాండ్‌కు పంపారు. కేసు వివరాలను సీఐ గట్ల మహేందర్ రెడ్డి సోమవారం మీడియా ఎదుట వెల్లడించారు. గ్రామ పంచాయతీ సమీపంలో నారసింహుల ప్రకాష్‌కు చెందిన కిరాణ దుకాణంలో ఇటీవల దొంగతనం జరిగింది. దీనిపై బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు సోమవారం విస్నూరు గ్రామంలో తనిఖీలు చేపట్టారు. ఆ సమయంలో ఆటోలో ఉన్న వ్యక్తి పోలీసులను పారిపోతుండగా అదుపులోకి తీసుకొని విచారించగా కిరాణం దుకాణంలో తానే చోరీ చేశానని అంగీకరించాడు. నిందితుడు నిజామాబాద్ జిల్లా సంగెం మండలంలోని చందూరు గ్రామానికి చెందిన కత్తి అశోక్‌గా పోలీసులు గుర్తించారు. అతడి వద్ద రూ.4 వేలు, ఒక సెల్ ఫోన్ స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశారు. సమావేశంలో ఎస్సైలు సాయి ప్రసన్నకుమార్, లింగారెడ్డి, హెడ్ కానిస్టేబుల్ సోమిరెడ్డి, కానిస్టేబుళ్లు రాజ్‌కుమార్, యాకయ్య, నరేష్ ఉన్నారు.

నిర్వహణకు నిధులేవీ?

జాడలేని మొదటి విడత పాఠశాలల గ్రాంట్లు

- ఎదురుచూస్తున్న హెచ్ఎంలు
- కష్టంగా మారిన స్కూళ్ల మెయింటెనెన్స్
- చాక్‌పీసులకు కూడా డబ్బుల్లేని పరిస్థితి
- సొంతంగా ఖర్చుచేసినా మంజూరుకాని బిల్లులు
- గతేడాది పరిస్థితే పునరావృతం



హనుమకొండ, జూలై 29 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ బడులను నిధుల కొరత వేధిస్తోంది. సాధారణ కార్యకలాపాలకు కూడా కష్టమవుతోంది. పాఠశాలల నిర్వహణ రోజు రోజుకు భారంగా మారుతోంది. విద్యా సంవత్సరం ప్రారంభమై నాలుగు నెలలవుతున్నా సర్కారు నుంచి నయాపైసా మంజూరు కాకపోవడంతో నిర్వహణ భారంగా పరిణమిస్తోంది. మూడు నెలలకు ఒకసారి ఇచ్చే నిర్వహణ గ్రాంట్ విషయంలో నిర్లక్ష్య ధోరణి కారణంగా పాఠశాల విద్యపై నమ్మకం సన్నగిల్లుతోంది. ప్రభుత్వాలు మారినా సర్కారు బడుల పరిస్థితి మారడం లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సర్కార్ బడులను బలోపేతం చేస్తున్నట్టు ప్రభుత్వం చెబుతున్నా.. పాఠశాల నిర్వహణకు కనీస నిధులను ఇవ్వడం లేదని, ఈ విషయంలో గత బీఆర్ఎస్ ప్రభుత్వం అనుసరించిన ధోరణినే ఈ ప్రభుత్వం కూడా అనుసరిస్తోందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. వాస్తవానికి ఈ గ్రాంట్‌ను ప్రతీ మూడు నెలలకోసారి విధిగా విడుదల చేయాలి. ఈ విద్యా సంవత్సరంలో మొదటి విడత గ్రాంట్ జూన్ మొదటి వారంలోనే మంజూరు కావాల్సి ఉండగా జూలై నెల కూడా ముగుస్తోంది. ఇప్పటి వరకు అతీగతీ లేదు. నిర్వహణ గ్రాంట్ ఎప్పుడు వస్తుందా అని ప్రధానోపాధ్యాయులు ఎదురుచూస్తున్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం కూడా నిర్వహణ గ్రాంట్‌ను సకాలంలో విడుదల చేయ లేదు. నిధులన్నీ మురగబెట్టి విద్యాసంవత్సరం ముగుస్తుందనగా ఒక్క సారే ఇచ్చింది. వాటిని సకాలంలో ఖర్చు చేయలేని పరిస్థితి ఏర్పడింది.

ఇబ్బందుల్లో ఉపాధ్యాయులు..

కాంగ్రెస్ ప్రభుత్వం కూడా ఇదే ధోరణితో వ్యవహరిస్తుండడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. 2024-25 విద్యా సంవత్సరం ప్రారంభమైనప్పటి నుంచి ఇప్పటివరకు నిధులు విడుదల కాలేదు. ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు ఇబ్బందులు పడుతున్నారు. మరికొన్ని పాఠశాలల్లో టీచర్లే సొంత డబ్బులు వెచ్చింది కొంత మేర సౌకర్యాలు సమ కూర్చుకుంటున్నారు. సాధారణంగా విద్యార్థుల సంఖ్య మేరకు నిర్వహణ గ్రాంట్లు వస్తాయి. 1 నుంచి 30 మంది విద్యార్థులున్న పాఠశాలలకు రూ.10 వేల వరకు, 31 నుంచి 100మంది విద్యార్థులున్న స్కూళ్లకు రూ.25 వేలు, 101 నుంచి 250 మంది విద్యార్థులున్న బళ్లకు రూ.50వేలు, 251 నుంచి 1000 మంది విద్యార్థులున్న పాఠశాలలకు రూ.75వేల వరకు ఇస్తారు.

మొత్తం 4,777 స్కూళ్లు..

ఉమ్మడి వరంగల్ జిల్లాలో 4,777 ప్రభుత్వ, ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలున్నాయి. హనుమకొండ జిల్లాలో 865, జనగామ జిల్లాలో 638, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో 532, మహబూబాబాద్ జిల్లాలో 1181, ములుగు జిల్లాలో 550, వరంగల్ జిల్లాలో 1011 పాఠశాలున్నాయి. వీటిలో సుమారు 3.27 లక్షలకుపైగా విద్యార్థులు చదువుతున్నారు. ప్రభుత్వం ఏటా నాలుగు విడతలుగా విద్యార్థుల సంఖ్యను బట్టి గరిష్ఠంగా రూ.12500వరకు నిధులను అందించాలి. వాటి తోనే పాఠశాలల్లో చాక్‌పీసులు మొదలు హాజరు రిజిస్టర్లు, ఇతర అవసరమైన సామగ్రి, ప్రయోగశాల రసాయనాలను కొనుగోలు చేయాల్సి ఉంటుంది. అయితే ఇప్పటి వరకు నిధులు విడుదల చేయని కారణంగా బడుల నిర్వహణకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయని ప్రధానోపాధ్యాయులు అంటున్నారు.

స్కూల్ కాంప్లెక్సులకు..

ఉమ్మడి జిల్లాలో సర్కారు బడుల్లో మండల రిసోర్సు కేంద్రాలు, పాఠశాల కాంప్లెక్సుల వారీగా ప్రభుత్వం ఏటా నిర్వహణ నిధులను మంజూరు చేస్తోంది. ఒక్కో ఎమ్మార్సీకి ఏడాదికి రూ.90వేలు, ఒక్కో పాఠశాల కాంప్లెక్సుకు రూ.33 వేలుగా నిర్దేశించారు. బడుల సంఖ్యకు అనుగుణంగా రూ.10వేల నుంచి రూ.80వేల దాకా అందిస్తారు. 2020-21 విద్యా సంవత్సరంలో బడులకు సగమే నిధులిచ్చారు. 2021-22లో ముందుగా సగం నిధులు ఇచ్చి మిగతావి మార్చి 31వ తేదీ వరకు మంజూరు చేశారు. ఏప్రిల్‌లో అన్ని బ్యాంకుల్లోని ఖాతాలను విద్యాశాఖ అధికారులు మూసేశారు. ఖర్చుకాని నిధులన్నింటిని వెనక్కి తీసుకున్నారు. 2022-23లో జనవరి వరకు నిర్వహణ నిధులను ఖాతాల్లో వేశారు. 2023-24 విద్యా సంవత్సరం లోనూ పూర్తి స్థాయిలో నిధులు రాలేదు. 2024-25 విద్యా సంవత్సరంలోనైనా ఈ నిధులు పూర్తిస్థాయిలో విడుదల వుతాయా అన్న సందేహం ప్రధానోపాధ్యాయులను వెంటాడుతోంది. ఈ పాటికే కొన్ని నిధులు విడుదల కావలసి ఉండింది. కానీ ఇప్పటి వరకు ఒక్క పైసా రాలేదు.

క్రీడానిధులెప్పుడు?

విద్యార్థినీ, విద్యార్థులకు క్రీడలతో పాటు ఆత్మ రక్షణ శిక్షణలో భాగంగా ఏడాదికి రూ.15వేలు కూడా ఇవ్వాలి. ఈ నిధులు ఎప్పుడు వస్తాయో తెలియదు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఇటీవల పీఈటీలను పీడీలుగా పదోన్నతులు కల్పించారు. విద్యార్థులకు పలు చోట్ల పరికరాలు లేవు. మైదానాలు చదునుచేయడానికి ఆర్థిక వనరుల అవసరం ఉంటోంది. క్రీడల నిర్వహణకు ఇప్పటి వరకు నిధులు కేటాయించకపోవడంతో అనేక పాఠశాలల్లో విద్యార్థులు ఆటలకు దూరం అవున్నారనే వాదన వినిపిస్తోంది. ఓ పక్క అట్టహాసంగా ఒలింపిక్ క్రీడలు ప్రారంభమైన నేపథ్యంలో విద్యార్థుల్లో స్వతహాగా క్రీడలపై ఆసక్తి నెలకొంటుండడం సహజం. నిధులు లేకపోవడంతో పీడీలు కూడా నిస్సహాయత వ్యక్తం చేస్తున్నారు.

డిపో స్థలాన్ని ఆస్పత్రికి ఇచ్చే విషయం తెలియదు

- బస్సుల్లో పురుషుల సీట్లపై త్వరలో నిర్ణయం
- ఆర్టీసీ రీజినల్ మేనేజర్ విజయ్‌భాను



ఆర్టీసీ బస్టాండ్‌లో మొక్కలు నాటుతున్న ఆర్ఎం విజయ్‌భాను

స్టేషన్‌ఘన్‌పూర్, జూలై 29: స్టేషన్‌ఘన్‌పూర్‌లోని ఆర్టీసీ డిపోకు సంబంధించిన స్థలాన్ని వంద పడకల ఆస్పత్రికి కేటాయించే విషయం మా దృష్టిలో లేదని, ఎలాంటి ఉత్తర్వులు రాలేదని ఆర్టీసీ వరంగల్ రీజినల్ మేనేజర్ (ఆర్ఎం) విజయ్‌భాను అన్నారు. సోమవారం ఆయన ఘన్‌పూర్ ఆర్టీసీ బస్టాండ్‌లో ఏర్పాటు చేసిన వనమహోత్సవం కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మొక్కలు నాటారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశాల మేరకు ఆర్టీసీ ఆధ్వర్యంలో వనమహోత్సవం కార్యక్రమాన్ని చేబడుతున్నామని తెలిపారు. అందులో భాగంగా రీజినల్ పరిధిలోని 9 డిపోల్లో, ఆర్టీసీ బస్టాండ్‌లలో, ఆర్టీసీ స్థలాల్లో మొక్కలు నాటుతున్నామని అన్నారు. ప్రభుత్వం ఇచ్చిన లక్ష్యం మేరకు మొక్కలను నాటుతున్నట్లు తెలిపారు. రానున్న రోజుల్లో ఆర్టీసీ సేవలు మరింత మెరుగు అవుతాయన్నారు. కరోనా సమయంలో కొన్ని గ్రామాలకు ఆర్టీసీ సర్వీసులు బంద్ చేశామని, త్వరలోనే వాటిని పునరుద్ధరిస్తామని తెలిపారు. మహాలక్ష్మి పథకంతో మహిళలు బయటకు వచ్చి ఆర్థికపరమైన కార్యక్రమాల్లో పాల్గొనడం శుభ పరిణామమని అన్నారు. కాగా, ప్రస్తుతం బస్సుల్లో మహిళలే ఎక్కువగా ప్రయాణిస్తున్నందున పురుషులకు సీట్లు దొరకడం లేదని, ఈ విషయం ఉన్నతాధికారుల దృష్టిలో ఉందని, ఈ సమస్యపై త్వరలో విధానపరమైన నిర్ణయం తీసుకుంటామని అన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ ఆర్ఎం భాను కిరణ్, వరంగల్-1 డిపో మేనేజర్ మోహన్‌రావు, కంట్రోలర్ ఈఎస్ బాబు, సిబ్బంది శివానందు, రాజేందర్, బోసు ఐలయ్య తదితరులు పాల్గొన్నారు.











కారు అదుపుతప్పి యువకుడికి గాయాలు

ఎయిర్‌బ్యాగ్ తెరుచుకోవడంతో తప్పిన ప్రమాదం

గూడూరు, జూలై 29: మండలంలోని నాయకపల్లి గ్రామంలో ఆదివారం రాత్రి ఓ కారు అతివేగంగా దూసుకువెళ్లి పొలాల్లోకి వెళ్లి బోల్తా పడింది. మండలంలోని దామరవంచకు చెందిన నలుగురు యువకులు ఆదివారం రాత్రి 10 గంటల ప్రాంతంలో గూడూరు నుంచి మహబూబాబాద్‌కు కారులో వెళ్తున్నారు. నాయకపల్లిలో అతివేగంగా నడుపుతూ రోడ్డుపై కుక్క ఉండడంతో ఎడమ వైపుకు వాహనం తిప్పాడు. ఎడమ వైపున ఉన్న ఓ వ్యక్తి సెల్ లైట్ వేసుకుని నడుచుకుంటూ వెళ్తుండడంతో గమనించిన డ్రైవర్ ఆవెంటనే మళ్లీ కుడివైపుకు తిప్పాడు. కుడివైపున ఉన్న చిన్నకంకర కుప్పపైకి వెళ్లడం, ఆవెంటనే ఎడమవైపుకు వేగంగా దూసుకెళ్తూ తొలుత కల్వర్టును ఢీకొట్టింది. ఆపై ఓ చెట్టును, హైటెన్షన్ విద్యుత్ స్తంభానికి ఏర్పాటు చేసిన స్టే వైరును కారు ఢీకొట్టి రోడ్డు కింది భాగంలోని పొలాల్లో పడింది. వాహనంలో ఉన్న ఎయిర్‌బ్యాగులు సకాలంలో తెరుచుకోవడంతో ముందుభాగంలో ఉన్న వారికి ప్రాణాపాయం తప్పింది. వాహనం నడుపుతున్న దామరవంచ తండాకు చెందిన నూనావత్ సిద్దు తలకు గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు 108 ద్వారా గూడూరు సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించి చికిత్సనందిస్తున్నారు. ప్రమాదం జరిగిన కొద్ది దూరంలో రోడ్డువెంట మాట్లాడుతున్న గ్రామస్తులు, చిన్నపిల్లలు, రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తున్న వ్యక్తి పక్క నుంచే కారు అతివేగంగా దూసుకుపోవడంతో వారు భయాందోళనకు గురయ్యారు.


ప్రమాదంలో గాయపడిన నూనావత్ సిద్దు











సింగరేణి స్కూళ్లలో సీబీఎస్ఈ సిలబస్

బోర్డుకు దరఖాస్తు చేసిన సంస్థ

హైదరాబాద్, జూలై 29 (ఆంధ్రజ్యోతి): సింగరేణిలో పనిచేస్తున్న కార్మికుల పిల్లలకు, పరిసర ప్రాంత విద్యార్థులకు ఉన్నత ప్రమాణా లు గల మరింత నాణ్యమైన విద్యను అందించాలన్న ఉద్దేశంతో వ చ్చే విద్యాసంవత్సరం నుంచి సింగరేణి పాఠశాలలో సెంట్రల్ బో ర్డు ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్(సీబీఎస్ఈ)సిలబస్‌ను బోధించాలని ఆ సంస్థ నిర్ణయించింది. దీనికోసం తొలుతగా రామగుండం-2 ఏరియా ఇంక్లైన్ కాలనీలో ఉన్న సెక్టార్-3 సింగరేణి పాఠశాలలో సీబీఎస్ఈ బోధనను చేపట్టనుంది. ఈ మేరకు సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్‌కు సింగరేణి సంస్థ దరఖాస్తు సమర్పించింది. దీనికన్నా ముందు తెలం గాణ విద్యాశాఖనుం చి నిరభ్యంతర పత్రం(ఎన్‌వోసీ) తీసుకొని దరఖా స్తును సమర్పించింది. దాంతో పాఠశాలను పరిశీలించడానికి వీలుగా త్వరలోనే సీబీఎస్ఈకి చెందిన ఉన్నత స్థాయి బృందం రామగుండం చేరుకొని, తరగతి గదులను, పాఠశాల క్రీడా మైదానం , ప్రయోగ శాలలు, ఇతర మౌలిక వసతులు తదితర అన్ని అంశాలను పరిశీలించి, తగి న సిఫారసులు చేసే అవకాశాలున్నాయి. ప్రస్తుతానికి రామగుం డం లో, ఆ తర్వాత శ్రీరాంపూర్ ఏరియాలోనూ దీన్ని అందుబాటు లోకి తీసుకురావాలని నిర్ణయించారు.

కార్మికులకు కనీస వేతనం రూ.26వేలు చెల్లించాలి


కరపత్రాలను ఆవిష్కరిస్తున్న దృశ్యం

వరంగల్ మెడికల్, జూలై 29 : కార్మిక వర్గ హక్కుల కోసం, కార్మిక చట్టాల సవరణకు వ్యతిరేకంగా నిర్వహిస్తున్న రాష్ట్ర సదస్సును జయ ప్రదం చేయాలని ఎంజీఎం ఆస్పత్రి కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ కార్మికులు పిలుపునిచ్చారు. సోమవారం ఎంజీఎం ఆవరణలో సెక్యూరిటీ గార్డు, కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల ఆధ్వర్యంలో తెలంగాణ అసంఘటిత కార్మికుల సమాఖ్య కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆగస్టు 4న వరంగల్‌లో కార్మిక వర్గ హక్కుల కో సం, కార్మిక చట్టాల సవరణకు వ్యతిరేకంగా రాష్ట్ర సదస్సు నిర్వహి స్తున్నట్లు పేర్కొన్నారు. ప్రతీ కార్మికుడికి కనీస వేత నం రూ. 26వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్, సెక్యూరిటీ గార్డు, శానిటేషన్, పేషంట్ కేర్ ఉద్యోగులను తక్షణ మే పర్మినెంట్ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంజీఎం హాస్పిటల్ వివిధ విభాగాల్లో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్టు ఉద్యోగులు, సి బ్బంది గొర్రె నాగరాజు, ఆర్.రాజు, సుధాకర్, పుష్ప, రాజవీరు, ఇంద్ర, విజయ్, కోమల, మంజుల, అశోక్, రాజేష్, రాజమణి, జ్యోతి, నాగరాజు, చందు, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.





సీఎంకు పండుగల పంచాంగం అందజేత



సీఎంకు పండుగల జాబితాను అమ్మవారి ప్రసాదాన్ని అందించిన సభ్యులు

వరంగల్ కల్చరల్, జూలై 29: తెలంగాణ విద్వత్‌సభ ఆధ్వర్యంలో పంచాంగకర్తలు, సిద్ధాంతులు ధర్మశాస్త్రాలకు అనుగుణంగా పండుగల నిర్వహణను తెలియజేసే 2025-26 విశ్వవసు నామ సంవత్సర జాబితా(పంచాంగం)ను అసెంబ్లీలో ముఖ్యమంత్రి కార్యాలయంలో సీఎం రేవంత్‌రెడ్డికి సోమవారం అందించారు. అలాగే, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖకు జూబ్లీహిల్స్‌లోని స్వగృహంలో సభ బాధ్యులు సమర్పించారు. వారు మాట్లాడుతూ విద్వత్‌సభ వారికి ఏ అవసరం వచ్చినా తీర్చాలని దేవాదాయ శాఖకు సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశిలిచ్చినట్టు పేర్కొన్నారు. పండుగల నిర్వహణలో ఎలాంటి అనిశ్చితి లేకుండా జాబితాను నిర్ధారించి అందించినందుకు మంత్రి సురేఖ అభినందించారన్నారు. కార్యక్రమంలో దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి శైలజ రామయ్యర్, కమిషనర్ హన్మంతరావు, భద్రకాళి దేవస్థానం ప్రధానార్చకులు భద్రకాళి శేషు(వరంగల్), యాదాద్రి దేవస్థానం చైర్మన్ నర్సింహమూర్తి, ప్రధానార్చకులు నర్సింహచార్యులు(యాదాద్రి), విద్వత్‌సభ కార్యదర్శి దివ్యజ్ఞాన సిద్ధాంతి(మేడపల్లి-నల్లగొండ), కోశాధికారి ఎంవీఆర్ శర్మ(హైదరాబాద్), వేదపండితులు నటార్‌శర్మ(వరంగల్), సాయిదీక్షిత్(వరంగల్) పాల్గొన్నారు.

పాఠశాలల్లో స్కావెంజర్లను నియమించాలి



జిల్లా కార్యవర్గ సమావేశంలో మాట్లాడుతున్న కడారి భోగేశ్వర్

వరంగల్ ఎడ్యుకేషన్, జూలై 29 : ప్రభుత్వ పాఠశాలల్లో స్కావెంజర్లను వెంటనే నియమించాలని టీపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కడారి బోగేశ్వర్ డిమాండ్ చేశారు. సోమవారం హనుమకొండలోని సుబేదారి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో టీపీటీఎఫ్ వరంగల్ జిల్లా కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన భోగేశ్వర్ మాట్లాడుతూ... పాఠశాలలు ప్రారంభమై రెండు నెలలు గడుస్తున్నా పాఠశాలల్లో పారిశుధ్య పనులను ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. పాఠశాలల్లో మెరుగైన వసతులు కల్పించి నాణ్యమైన విద్యను అందించాలన్నారు. ఇటీవల జరిగిన పదోన్నతుల్లో బీఈడీ కలిగి ఎస్జీటీలు నష్టపోయారని, వారికి పదోన్నతులు కల్పించాలన్నారు. కాంగ్రెస్ మేనిఫెస్టోలో ప్రకటించిన విధంగా సీపీఎస్‌ను రద్దు చేయాలన్నారు. పెండింగ్‌లో ఉన్న డీఏలను విడుదల చేయాలన్నారు. చాలా పాఠశాలల్లో మూత్రశాలలు, మరుగుదొడ్లు నిర్మాణమయ్యాయని, వాటి నిర్వహణకు స్కావేంజర్లను నియమించాలన్నారు. ఉపాధ్యాయుల పెండింగ్ బిల్లులను మంజూరు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు జి. వెంకటేశ్వర్లు, పి. మనోజ్, స్వామి, తన్వీర్, బుచ్చాచారి, అశోక్, పూర్ణ చందర్, రమేష్, రవి, మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

పారా ఒలింపిక్స్‌కు టెక్నికల్ అఫిషియల్‌గా కేసముద్రం పీడీ



కొమ్ము రాజేందర్

కేసముద్రం, జూలై 29 : ప్యారిస్‌లో ఆగస్టు 25 నుంచి సెప్టెంబరు 5వ తేదీ వరకు జరిగే పారా ఒలింపిక్స్‌కు దేశం తరఫున బ్యాడ్మింటన్ క్రీడకు టెక్నికల్ అఫిషియల్‌గా కేసముద్రం జడ్పీ హైస్కూల్ ఫిజికల్ డైరెక్టర్ కొమ్ము రాజేందర్ ఎంపికైనట్లు ఉమ్మడి జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ ఎస్.రమేష్‌కుమార్, కార్యదర్శి డాక్టర్ పి.రమేష్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అంతర్జాతీయ బ్యాడ్మింటన్ అంపైర్‌గా రాజేందర్ గతంలో రెండుసార్లు ప్రపంచ ఛాంపియన్‌షిప్ పోటీలకు, ఏషియన్ గేమ్స్, బ్యాడ్మింటన్ ఏషియా, ఏషియన్ స్కూల్ గేమ్స్, కామన్ వెల్త్ క్రీడలు, మూడుసార్లు ప్రీమియర్ బ్యాడ్మింటన్ లీగ్, టాటా ఓపెన్ ఇంటర్నేషనల్, ఇన్ఫోసిస్ ఇంటర్నేషనల్, ఆల్ ఇండియా పోలీస్ బ్యాడ్మింటన్, నేషనల్ గేమ్స్, సౌత్ జోన్ క్రీడలతో పాటు అనేక జాతీయ స్థాయి క్రీడలకు అంపైర్‌గా వ్యవహరించినట్లు చెప్పారు. తాజాగా వరల్డ్ బ్యాడ్మింటన్ ఫెడరేషన్ వారు టెక్నికల్ అఫిషియల్‌గా రాజేందర్‌ను ఎంపిక చేసినట్లు వారు తెలిపారు. ఈ సందర్భంగా అసోసియేషన్ కోశాధికారి నాగకిషన్, స్థానిక హైస్కూల్ హెచ్‌ఎం బి.రాజు, ఉపాధ్యాయ బృందం, పలువురు గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

ఆర్‌పీఐ ఉమ్మడి జిల్లా గౌరవ అధ్యక్షురాలిగా విజయ



విజయ

వడ్డెపల్లి, జూలై 29 : రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా (ఆర్‌పీఐ) బొజ్జా తారకం ఉమ్మడి వరంగల్ జిల్లా గౌరవ అధ్యక్షురాలిగా హనుమకొండ పట్టణానికి చెందిన చేపూరి విజయ నియమితులయ్యారు. ఆర్‌పీఐ బొజ్జా తారకం రాష్ట్ర అధ్యక్షుడు జన్ను సాంబయ్య ఆదేశం మేరకు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అంకేశ్వరపు రమేష్ ఈ మేరకు సోమవారం నియామక ఉత్తర్వులు జారీ చేశారు. రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్. అంబేద్కర్, ఆర్‌పీఐ వ్యవస్థాపకులు బొజ్జా తారకం ఆశయాల సాధన కోసం కృషి చేస్తానని చేపూరి విజయ పేర్కొన్నారు.

ఆదుకోవాలని కళాకారుల భిక్షాటన



భిక్షాటన చేస్తున్న కళాకారులు

హనుమకొండ కల్చరల్, జూలై 29 : ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం కోసం జరిగిన పోరాటంలో అమరవీరుల అనంతరం గళమెత్తి ఉద్యమించిన కళాకారులను ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతూ కళాకారులు నిరసనగా భిక్షాటన చేశారు. వరంగల్ చౌరస్తాలో ఒక బృందం, హనుమకొండ చౌరస్తాలో ఒక బృందం కళాకారులు భిక్షాటన చేశారు. ఇందిరమ్మ రాజ్యంలో కళాకారులకు న్యాయం చేయాలంటూ కోరారు. రోడ్డుపక్కన ఉన్న షాపుల్లోకి వెళ్లి భిక్షాటన చేశారు. కళాకారుల కోసం ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసి ఆదుకోవాలన్నారు. సకల కళా సాంస్కృతిక మండలి రాష్ట్ర అధ్యక్షుడు గడ్డం సుధాకర్, ఎస్ కే.రాజు, బిర్రు సురేందర్, గుండెకారి సునీల్, సదానందం, డప్పు కార్తీక్, వెంకట్, హనుమకొండ జిల్లా అధ్యక్షుడు ఇ.చంద్రశేఖర్, పరమేశ్వరి, రాయబారపు సాంబయ్య తదితర సుమారు 100 మంది కళాకారులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

లెఫ్ట్ ఓవర్ వేకెన్సీల్లో పదోన్నతులు

వరంగల్ ఎడ్యుకేషన్, జూలై 29 : ఉపాధ్యాయులకు ఇటీవల పదోన్నతులు నిర్వహించగా కొన్ని ఖాళీలు మిగిలాయి. వరంగల్ జిల్లాలో 43 ఖాళీలు ఏర్పడగా హనుమకొండ జిల్లాలో సైతం 43 ఖాళీలే ఏర్పడ్డాయి. దీంతో మిగులు ఖాళీల్లో సైతం అర్హులైన ఉపాధ్యాయులకు సోమవారం పదోన్నతులు కల్పించారు. వరంగల్ జిల్లాలో పీఎస్ హెచ్‌ఎంలు 4, హిందీలో 5, ఫిజికల్‌సైన్స్‌లో 1, సోషల్ స్టడీస్‌లో 9, స్పెషల్ ఎడ్యుకేషన్ 2, తెలుగులో 7, బయోసైన్స్‌లో 8, ఇంగ్లీష్‌లో ఐదుగురు ఉపాధ్యాయులు పదోన్నతులు పొందారు. అయితే వరంగల్‌లో 40 మంది ఉపాధ్యాయులకి మాత్రమే ప్రమోషన్ రాగా, మిగతా మూడు ఖాళీల్లో సంబంధిత సబ్జెక్టు ఉపాధ్యాయులు లేకపోవడంతో 3 ఖాళీలు అలాగే ఉన్నాయి. హనుమకొండ జిల్లాలో పీఎస్ హెచ్‌ఎంలలో 11, సోషల్ స్టడీస్‌లో 16, బయోసైన్స్‌లో 8, ఇంగ్లీష్‌లో 7, ఫిజికల్ సైన్స్‌లో ఒక్కరు పదోన్నతి పొందారు. వీరందరికి సోమవారం ఆర్డర్లు ఇవ్వగా మంగళవారం పాఠశాలల్లో జాయిన్ కానున్నారు.

సీపీ పేరిట నకిలీ ఫేస్ బుక్ అకౌంట్

ఫ్రెండ్ రిక్వెస్ట్ పంపుతున్న సైబర్ నేరగాళ్లు

వరంగల్ క్రైం, జూలై 29 : సైబర్ నేరగాళ్లు వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా పేరిట నకిలీ ఫేస్ బుక్ క్రియేట్ చేశారు. నకిలీ ఫేస్ బుక్ క్రియేట్ చేసి పలువురు ఖాతాదారులకు ఫ్రెండ్ రిక్వెస్ట్ పంపుతున్నారు. ఈ విషయమై అప్రమత్తమైన కమిషనర్ కార్యాలయం ఒక ప్రకటన విడుదల చేసింది. కమిషనర్ అంబర్ కిషోర్ పేరిట వస్తున్న ఫ్రెండ్ రిక్వెస్ట్‌కు ఎవరూ స్పందించకూడదని పేర్కొన్నారు. ఇది నకిలీ ఫేస్ బుక్ అని గుర్తించాలని వారు పేర్కొన్నారు.

శిల్పారామం ఏర్పాటెప్పుడు?



హైదరాబాద్‌లోని ఈ శిల్పారామం తరహాలోనే వరంగల్‌లోనూ ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు..

- రూ.6కోట్లు ఇచ్చినా ముందుకు పడని అడుగు
- పట్టించుకోని గత బీఆర్‌ఎస్ సర్కార్
- స్థలం ఎంపికపైనే ఎడతెగని తకరారు
- ప్రస్తుత ప్రభుత్వమైనా చొరవ తీసుకోవాలంటున్న నగర వాసులు

పద్నాలుగేళ్ల క్రితం మంజూరు

హన్మకొండ, జూలై 29 (ఆంధ్రజ్యోతి) : హైదరాబాద్ తరహాలో వరంగల్‌లో కూడా శిల్పారామం ఏర్పాటు చేస్తామని పద్నాలుగేళ్ల క్రితం అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించింది. అందుకు రూ.6కోట్లకు పైగా నిధులను కూడా మంజూరు చేసింది. కానీ ఆ పనులు నేటికీ మొదలవలేదు. అసలు శిల్పారామం ఏర్పాటుకు అవసరమైన స్థలం ఎంపికపైన ఏర్పడిన తకరారు ఇప్పటికీ సాగుతూనే ఉంది. ప్రభుత్వ స్థలాలు అందుబాటులో ఉన్నా ఎంపికలో తీవ్ర జాప్యం జరుగుతోంది. కాంగ్రెస్ ప్రభుత్వంలోనే మంజూరైన శిల్పారామం ప్రాజెక్టును ఆచరణలోకి తీసుకోవలసిన బాధ్యత ప్రస్తుత కాంగ్రెస్ సర్కార్‌పైనే ఉందని వరంగల్ నగర వాసులు పేర్కొంటున్నారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం హయాంలో సాకారం కాని తమ చిరకాల స్వప్నాన్ని నెరవేర్చాలని కోరుతున్నారు.

14 ఏళ్లనాటి కల..

నగర వాసుల శిల్పారామం కల ఇప్పటిది కాదు. పదమూడేళ్లనాటిది. నాటి ప్రభుత్వం నిధులిచ్చినా ఎక్కడ ఏర్పాటు చేయాలనే విషయంలో స్పష్టత లేకపోవడం ఈ ప్రాజెక్టుకు శాపంగా మారింది. అనువైన స్థలం గుర్తింపులో అధికారుల వైఫల్యం గ్రహపాటుగా మారింది. ఉమ్మడి రాష్ట్రంలో వైఎస్ రాజశేఖర్ రెడ్డి హయాంలో శిల్పారామం మంజూరైంది. హైదరాబాద్ తరహాలో వరంగల్‌లో ఏర్పాటుకు 2008లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం జీవో జారీ చేసింది. ఇప్పటి వరకు కార్యరూపం దాల్చలేదు. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైన తర్వాత శిల్పారామం ఏర్పాటులో కొంత కదలిక వచ్చినా ఆ తర్వాత కాలంలో పరిస్థితి మళ్లీ మొదటికి వచ్చింది. సీఎం కేసీఆర్ వరంగల్ నగరాన్ని సందర్శించినప్పుడు వరంగల్‌తో త్వరలో శిల్పారామం ఏర్పాటుపై ఇచ్చిన హామీ, మంత్రులు, ప్రజాప్రతినిధులు ఆయా సందర్భాల్లో చేసిన ప్రకటనలు గాలిమాటలుగానే మిగిలి పోయాయి. స్థానికంగా ఉన్న హస్తకళాకారుల ఉత్పత్తులకు మార్కెటింగ్ కల్పించేందుకు, పట్టణాల్లో నివసించే వారికి పల్లె వాతావరణం రుచి చూపేందుకు, వివిధ ప్రదర్శనల ద్వారా స్థానిక కళాకారులకు ఉపాధి కల్పించేందుకు. పర్యాటకులను విశేషంగా ఆకట్టుకునేందుకు రాష్ట్రంలోని అన్ని ముఖ్య నగరాల్లో శిల్పారామాలను ఏర్పాటు చేయాలని 2008లో అప్పటి ముఖ్యమంత్రి రాజశేఖరరెడ్డి నిర్ణయించారు. హైదరాబాద్ తరహాలోనే వరంగల్‌తో పాటు సంగారెడ్డి, కడప, విశాఖపట్టణం, తిరుపతి, అనంతపూర్‌లలో వీటిని ఏర్పాటు చేయనున్నట్టు ప్రకటించారు. అప్పటి నుంచి వరంగల్ ప్రజలు శిల్పారామం కోసం ఎంతో ఆశతో ఎదురుచూస్తున్నారు. అధికారులు కసరత్తు చేసినా ఇప్పటి వరకు కొలిక్కి రాలేదు.

మూలుగుతున్న నిధులు

వరంగల్‌లో ఏర్పాటు చేసే శిల్పారామంలో వివిధ చేతి వృత్తుల అమ్మకానికి 40కిపైగా స్టాళ్లు, నాటక, కళా ప్రదర్శనలకు ఓపెన్ ఏయిర్ థియేటర్, ఒక సమావేశ మందిరాన్ని ఏర్పాటు చేయాలని, శిల్పారామంలో చిన్నపాటి చెరువును ఏర్పాటు చేసి అందులో పిల్లల ఆహ్లాదానికి బోటింగ్ సౌకర్యం కల్పించాలని ప్రతిపాదించారు. అదనపు ఆకర్షణగా రాక్ గార్డెన్‌ను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. అప్పటి అంచనా ప్రకారం మొత్తం రూ.12కోట్ల వ్యయం కాగా దశల వారీగా నిధులు విడుదల చేస్తామని చెప్పిన నాటి ప్రభుత్వం తొలి విడతగా రూ.5కోట్లను, ఆ తర్వాత రూ.కోటి 14 లక్షలను మంజూరు చేసింది. మొత్తంగా రూ.6.14కోట్లు విడుదలైనా ఇప్పటికీ అవి ఖర్చు కాకుండా మూలుగుతున్నాయి. శిల్పారామం ఏర్పాటైతే స్థానికులకు ఉపాధి లభిస్తుంది. హస్తకళాకారులు తాము తయారు చేసిన కళారూపాలకు, ప్రధానంగా చేనేత కార్మికులు ఉత్పత్తి చేసిన వస్త్రాలకు మార్కెట్ లభిస్తుంది. పర్యాటకులు, నగరవాసులకు ఆహ్లాదం కూడా అందుతుంది.

స్థల ఎంపికలో తకరారు..

శిల్పారామం ఏర్పాటుకు స్థలం ఎంపికే పెద్ద సమస్యగా మారింది. ఎక్కడ ఏర్పాటు చేయాలనే విషయంలో అధికారులు తుది నిర్ణయానికి రాలేక పోతున్నారు. ఇప్పటి వరకు ఆయిదారు చోట్ల స్థలాలను చూశారు. వీటిలో కొన్నిటిని ఖరారు చేశారు. చివరి నిమిషంలో నిర్ణయాన్ని మార్చుకున్నారు. శిల్పారామంను మొదట హన్మకొండ గోపాలపురంలో ఏర్పాటు చేయాలని నిర్ణయించి ఓ బోర్డు కూడా ఏర్పాటు చేశారు. సుమారు 20 ఎకరాల స్థలం ఈ స్థల సేకరణకు అధికారులు కొంత కసరత్తు చేశారు. అయితే ఈ స్థలంలో అప్పటికే పలు అక్రమ నిర్మాణాలు జరిగినందు వల్ల శిల్పారామం ఏర్పాటు సాధ్యం కాదని భావించిన అధికారులు ప్రతిపాదనను ఉపసంహరించుకున్నారు. ఖిలా వరంగల్ కోట సమీపంలోనూ స్థలాన్ని చూసిన అధికారులు పర్యాటక ప్రాంతమైన ఓరుగల్లు కోటకు దగ్గరగా ఉందని, ఈ స్థలం అనుకూలమైందని భావించి ఏర్పాటుకు రంగం సిద్ధం చేశారు. కానీ కేంద్ర పురావస్తు శాఖ అభ్యంతరం చెప్పడంతో అక్కడ కూడా కార్యరూపం దాల్చలేదు. హన్మకొండ బాలసముద్రంలో హయగ్రీవాచారి గ్రౌండ్‌కు ఎదురుగా ఉన్న అయిదు ఎకరాల స్థలాన్ని కూడా చూశారు. అయితే ఈ స్థలం సరిపోదని, పైగా ఇది ఇళ్ల మధ్యలో ఉందని అధికారులు ఆ ఆలోచనను కూడా మానుకున్నారు. నగర శివార్లలోని హసన్‌పర్తిలో ఏర్పాటు చేసే విషయమై కూడా అధికారులు పరిశీలించారు. మామూనూరు సమీపంలో బెస్తం చెరువును అనుకొని జయశంకర్ స్మృతి వనం కోసం ప్రతిపాదించిన స్థలాన్ని కూడా పరిశీలించారు. నగరానికి 8కిలోమీటర్ల దూరంలో వరంగల్-ఖమ్మం రోడ్డును ఆనుకొని ఉన్న ఈ స్థలం శిల్పారామానికి అనువైనదిగా భావించారు. అప్పుడు కూడా యాదాద్రి టెంపుల్ డెవలప్‌మెంట్ కమిటీ (వైటీడీసీ) వైస్‌చైర్మెన్ కిషన్‌రావు, ఆర్ట్ డైరెక్టర్ ఆనంద్ సాయి ఈ స్థలాన్ని పరిశీలించారు. మొత్తం 60 ఎకరాల్లో శిల్పారామానికి 15 ఎకరాలు కేటాయించేందుకు నాటి కలెక్టర్ వాకాటి కరుణ అంగీకరించారు. కానీ అక్కడ కూడా ఏర్పాటు కాలేదు. చివరికి 2019 సెప్టెంబరు 19న నాటి ప్రభుత్వ చీఫ్ విప్ దాస్యం వినయ్‌భాస్కర్, కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్, హైదరాబాద్ శిల్పారామం జనరల్ మేనేజర్ కిషన్‌దాస్ వరంగల్ హంటర్ రోడ్డులో జూపార్క్‌కు ఎదురుగా, ప్రాంతీయ సైన్స్ కేంద్రం సమీపంలో అందుబాటులో ఉన్న సుమారు 30ఎకరాలను పరిశీలించారు. ఇక్కడ శిల్పారామం ఏర్పాటుకు ప్రభుత్వానికి ప్రతిపాదనను పంపించారు. కానీ రెండేళ్లవుతున్నా ఓ కొలిక్కి రాలేదు. ఇక్కడ ఇప్పటికే అక్రమణలు, నిర్మాణాలున్నాయి. పైగా పూర్తిగా గుట్ట ప్రాంతం. ఇక్కడికి చేరుకోవడానికి దారి లేదు. ప్రస్తుతం ఉన్న ప్రాంతీయ సైన్స్ సెంటర్ నుంచే వెళ్లాల్సి ఉంటుందన్న ఆక్షేపణలున్నాయి. కానీ నాడు ఎమ్మెల్యే, కలెక్టర్, వైటీసీ వైస్ చైర్మెన్, మాజీ ఐఏఎస్ అధికారి, ఆర్ట్ డైరెక్టర్ తదితరులు సమీక్షించడంతో పెండింగ్‌లో ఉన్న శిల్పారామానికి కూడా మోక్షం లభించనట్లేనని నగరవాసులు భావించారు. కానీ ఆ తర్వాత అంతా మొదటికే వచ్చింది. అయితే అయితే అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్ వెలువడడానికి కొద్ది రోజుల ముందు ఓటర్లను ఆకట్టుకునేందుకు నాటి బీఆర్‌ఎస్ ప్రభుత్వం కొంత హడావిడి చేసిందని, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వమైనా శిల్పారామాన్ని ఏర్పాటు చేయాలని నగరవాసులు కోరుతున్నారు.

అక్టోబరులో జూపార్కుకు పెద్దపులి

వర్షాల కారణంగా టైగర్ జోన్ ఏర్పాటుకు ఆటంకం



వర్షం నీళ్లు చేరడంతో నిలిచిన టైగర్‌జోన్ పనులు

హనుమకొండ కలెక్టరేట్, జూలై 29 : వచ్చే అక్టోబరులో హనుమకొండ హంటర్‌రోడ్‌లోని జూపార్కుకు పెద్దపులి రానుంది. మూడు నెలల క్రితం జూపార్కులో అధికారులు టైగర్ జోన్ ఏర్పాట్లు ప్రారంభించారు. వాస్తవానికి టైగర్ జోన్ పనులు ఇప్పటికే పూర్తిచేసి జూపార్కుకు పెద్దపులిని తీసుకురావాల్సి ఉంది. అయితే ఈ సంవత్సరం వర్షాలు ఎక్కువగా కురుస్తుండడంతో టైగర్ జోన్ చుట్టు కంచె ఏర్పాటు చేసేందుకు గుంతలు తీయగా ఆ గుంతల్లో వర్షంనీరు చేరి పనులకు ఆటంకం కలిగింది. మూడు నెలల్లో టైగర్‌జోన్ పనులు పూర్తిచేసి పెద్దపులిని తీసుకువస్తామని జిల్లా అటవీ శాఖ అధికారులు తెలిపినప్పటికీ వర్షాల కారణంగా పనులు ఇప్పటికే 70శాతం వరకు మాత్రమే పూర్తయ్యాయి. వచ్చే సెప్టెంబర్ నెల చివరి వరకు టైగర్ జోన్ పనులు పూర్తిచేసి జూపార్కుకు పులిని తీసుకు వచ్చేందుకు అటవీ శాఖ అధికారులు పనులు వేగవంతం చేశారు. ఎంతోకాలంగా నగరంలో పులిని చూద్దాం అనుకునే ప్రజలకు మరో రెండు నెలల్లో పులి జూపార్కులో కనిపించనుంది.

వర్షాల కారణంగా టైగర్‌జోన్ పనులు ఆలస్యం

మయూరి, ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్



మూడు నెలల్లో జూపార్కులో టైగర్‌జోన్ పనులు పూర్తి చేసి పులిని తీసుకొద్దామనుకున్నాం. వర్షాలు పడటం వలన టైగర్‌జోన్ పనులు చేసే ప్రాంతంలో నీళ్లు నిలిచి పనులు చేయడానికి కొంతవరకు ఇబ్బంది ఎదురవుతోంది. ప్రస్తుతం ఇంకా ఇక్కడికి పులిని తీసుకువచ్చే కండిషన్ లేదు. పులిని కొత్త ప్రదేశానికి తీసుకొచ్చేటప్పుడు కొన్ని జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉంటుంది. ఇప్పటి వరకు 70శాతం వరకు టైగర్‌జోన్ పనులు పూర్తయ్యాయి. ప్రస్తుతం బారికేడ్స్ పనులు జరుగుతున్నాయి. లోపల ఇంకా టైల్స్ వేయాలి. ఎలక్ట్రిసిటీ కనెక్షన్ ఇవ్వాల్సి ఉంది. ప్లంబింగ్ పనులు పెండింగ్‌లో ఉన్నాయి. సెప్టెంబర్ నెల చివరి వరకు పనులు పూర్తి చేసి అక్టోబర్‌లో జూపార్కుకు పెద్దపులిని తీసుకువస్తాం.

వెహికల్ ట్రాన్స్‌ఫోర్టు పేరుతో చోరీలు

అంతర్రాష్ట్ర దొంగ అరెస్టు .. రెండుకార్లు స్వాధీనం

మట్టెవాడ, జూలై 29 : వాహనాల ట్రాన్స్‌పోర్ట్ పేరుతో దొంగతనాలకు పాల్పడున్న అంతర్ రాష్ట్ర దొంగను మట్టెవాడ పోలీసులు సోమవారం అరెస్టు చేసినట్లు వరంగల్ ఏసీపీ నందిరాంనాయక్ తెలిపారు. సోమవారం దొంగల ముఠా అరెస్టు వివరాలను ఏసీపీ వెల్లడించారు. రెండు సంవత్సరాల నుంచి ఉత్తరప్రదేశ్‌కు ఆగ్రాకు చెందిన కృష్ణ కాంత్ సక్సేనా, రాజస్థాన్ రాఊంపాళీ ప్రాంతానికి చెందిన అనిల్ సోమకి, వికాస్‌లు వివిధ ప్రాంతాలకు చెందిన ట్రాన్స్‌ఫోర్టు, పార్శల్ సర్వీస్ వారి దగ్గరకు కస్టమర్ వెహికల్ ట్రాన్స్‌పోర్టు చేసేందుకు వారి వద్ద డ్రైవర్‌గా పని చేస్తూ దూర ప్రాంతాలకు కారును ట్రాన్స్‌పోర్టు చేయుటకు వారికి వాహనం ఇచ్చినప్పుడు ముగ్గురు కలిసి వాహనం నెంబరు ప్లేట్‌ని మార్చి, వరంగల్, హైదరాబాద్, బెంగుళూరు ప్రాంతాల్లో దొంగతనాలకు పాల్పడ్డారన్నారు. జూన్ 22న మహారాష్ట్ర గోండియా జిల్లాకు చెందిన వికాస్‌కు చెందిన ఎకోస్పోర్ట్ కారును జైపూర్‌లోని రిలీఫ్ రీ లోకేషన్ పార్శెల్ సర్వీసు వారి వద్ద నుంచి మహారాష్ట్ర గోండియాలో డెలివరి కోసం తీసుకొని, ఆ వాహనంలో గతంలో దొంగతనాలకు పాల్పడిన విధంగా జూన్ 24న వరంగల్‌కు వచ్చి హంటర్‌రోడ్‌లోని ఓస్వాల్ ఎలక్ట్రికల్ షాపు నుంచి సుమారు రూ. 2 లక్షల విలువైన ఫినోలెక్స్ ఎలక్ట్రికల్ వైరును దొంగిలించారు. షాపు యజమాని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి సీసీ కెమెరాలు, సాంకేతిక పరిజ్ఞానంతో సోమవారం ఆగ్రాకు చెందిన కృష్ణకాంత్ సక్సేనను అరెస్టు చేసి అతని వద్ద నుంచి ఎకోస్పోర్ట్, మారుతి రిడ్జ్ కార్లను స్వాధీనం చేసుకోవడం జరిగిందని ఏసీపీ తెలిపారు. కేసును చేధించడంలో ప్రతిభ కనబర్చిన ఎస్ఐ నవీన్ కుమార్, మట్టెవాడ క్రైమ్ పార్టీ పోలీసు సిబ్బంది అలీ, విజయ్, రాజు, తిరుపతి, నాగేశ్వర్‌రావు, ఐటీ కోర్ టీం సల్మాన్‌లను వరంగల్ ఏసీపీ నందిరాంనాయక్, మట్టెవాడ ఇన్‌స్పెక్టర్ గోపి అభినందించారు.



అరెస్టు చూపుతున్న వరంగల్ ఏసీపీ నందిరాంనాయక్

మహాలక్ష్మీ పథకంతో పెరిగిన ఆదాయం

ఆర్టీసీ ఆర్‌ఎం విజయభాను



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఆర్‌ఎం విజయభాను

బాలసముద్రం, జూలై 29 : రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహాలక్ష్మీ మహిళలకు ఉచిత బస్సు ప్రయాణంతో ఆర్టీసీకి ఆదాయం పెరిగిందని వరంగల్ రీజనల్ ఆర్టీసీ ఆర్‌ఎం విజయభాను అన్నారు. సోమవారం హనుమకొండలోని ఆర్‌ఎం కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆర్‌ఎం విజయభాను మాట్లాడుతూ వరంగల్ రీజనల్ పరిధిలో మొత్తం 928 బస్సులు ఉన్నట్లు తెలిపారు. మహాలక్ష్మీ పథకం కోసం 759 బస్సులు కేటాయించినట్లు ఆయన తెలిపారు. ఈ బస్సులలో 9 కోట్ల 46 లక్షల మంది ప్రయాణికులు ప్రయాణించగా 5 కోట్ల 78 లక్షల మంది మహిళలు ఉచిత ప్రయాణం చేసి మహాలక్ష్మీ స్కీంను వినయోగించుకున్నట్లు ఆయన తెలిపారు. పెరిగిన ప్రయాణికులకు గాను ఇబ్బందులు తలెత్తకుండా అన్ని రూట్లలో బస్సుల సంఖ్యను సమయాలను క్రమబద్ధీకరించినట్లు ఆయన తెలిపారు. నూతనంగా 20 రూట్లలో ప్రజలు ప్రజాపతినిధుల విజ్ఞప్తుల మేరకు బస్సు సర్వీసులు ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. మహాలక్ష్మీ పథకంతో ప్రయాణికులు ప్రయాణం పెరిగిందని హైదరాబాద్, కరీంనగర్, మరి కొన్ని రూట్లలో బస్సులు ఏర్పాటు చేయనున్నట్లు త్వరలో 42 బస్సులు రానున్నట్లు ఆర్‌ఎం తెలిపారు. మహాలక్ష్మీ పథకం ప్రారంభించినప్పటి నుంచి వరంగల్ రీజియన్‌కు రూ.554 కోట్ల 63లక్షల ఆదాయం వచ్చినట్లు తెలిపారు.

మహాలక్ష్మీ ప్రయాణికుల ద్వారా రూ.293 కోట్ల 58లక్షల ఆదాయం వచ్చినట్లు ఆయన తెలిపారు. హనుమకొండ నూతన బస్టాండ్ నిర్మాణం కోసం ప్రణాళికలు చేస్తున్నట్లు ప్రస్తుతం వరంగల్ బస్టాండు నిర్మాణ పనులు జరుగుతున్నట్లు ఆయన తెలిపారు. ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యేలు కృషి చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ మహాలక్ష్మీ పథకాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ప్రతీ గ్రామానికి త్వరలో ఆర్టీసీ బస్సుల ఏర్పాటుకు కృషి చేస్తామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఆర్‌ఎంలు భానుకిరణ్, మాధవరావు తదితరులు పాల్గొన్నారు.

రీ వాల్యుయేషన్ ఫలితాల కోసం ఎదురుచూపు

కేయూ డిగ్రీ సెమిస్టర్ విద్యార్థుల హైరానా

నిర్ణీత గడువు ముగిసినా ఫలితాల ఊసేలేదు



ఆన్‌లైన్‌లో రీవాల్యుయేషన్ కోసం విద్యార్థులు దరఖాస్తు చేసుకున్న రశీదు

కేయూ క్యాంపస్, జూలై 29 : కాకతీయ యూనివర్సిటీలో డిగ్రీ రీవాల్యూవేషన్ ఫలితాల కోసం విద్యార్థులు ఎదురుచూస్తున్నారు. గత డిసెంబరులో వర్సిటీ డిగ్రీ కోర్సుల 1, 3, 5 సెమిస్టర్ విద్యార్థుల పరీక్షలు నిర్వహించారు. ఏప్రిల్‌లో పరీక్షల ఫలితాలను విడుదల చేశారు. అయితే చాలా మంది విద్యార్థులు తమ పరీక్షల ఫలితాలను రీవాల్యూవేషన్ చేయాలని దరఖాస్తులు వర్సిటీ అధికారులకు చేసుకున్నారు. ఒక్కో సబ్జెక్టుకు రూ. 305 చెల్లించారు. వర్సిటీకి బీఏ, బీకాం, బీఎస్సీ తదితర కోర్సుల్లో వేలల్లో దరఖాస్తులు వచ్చాయి. సాధారణంగా నెల రోజుల్లో దరఖాస్తులు చేసుకున్న విద్యార్థులందరికీ తమ సబ్జెక్టులలో రీవాల్యూవేషన్, రీ కౌంటింగ్ చేసి ఫలితాలను విడుదల చేస్తారు. విద్యార్థులు తాము దరఖాస్తులు చేసుకున్నటువంటి సబ్జెక్టు మంచిగా రాసినట్లయితే రీవాల్యూవేషన్, రీకౌంటింగ్‌లో బేనిఫిట్ పొందుతారు. లేక నాట్ బేనిఫిట్ అని ఫలితాలు వస్తాయి.

రీవాల్యూవేషన్‌కు దరఖాస్తులు చేసుకుని నెలలు గడిచినా వర్సిటీ అధికారులకు ఫలితాలను వెల్లడించాలనే ఊసే రావడం లేదు. దరఖాస్తులు చేసుకున్నప్పటి నుంచి నెల 15 రోజుల్లో ఫలితాలను వెలువరించాలనే నిబంధనలున్నప్పటికీ అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదు. ఫలితాల కోసం విద్యార్థులు కాలం గడుస్తుండటంతో కళ్ళు కాయలు కాసేలా చూస్తున్నారు.

6వ సెమిస్టర్‌ది ఇచ్చారు.. మిగతావి మరిచారు...

ఉన్నత విద్య ప్రవేశాలకు వేళ్ళే విద్యార్థుల వెసులుబాటును ఆలోచించిన వర్సిటీ పరీక్షల నియంత్రణాధికారులు డిగ్రీ 6వ సెమిస్టర్ రీవాల్యూవేషన్ ఫలితాలను ఇచ్చారు. మిగతా 1, 2,3, 4, 5వ సెమిస్టర్ డిగ్రీ కోర్సులు ఫలితాలను మరిచారు. అయితే 1 నుంచి 5వ సెమిస్టర్‌లో ఏదైనా ఒక్క సబ్జెక్టు తప్పిన విద్యార్థి ఉన్నట్లయితే ఉన్నత విద్య ప్రవేశాలకు అర్హత కోల్పోతారు. దీన్ని గుర్తించని వర్సిటీ అధికారులు విద్యార్థులకు లాభం చేశామనే ఉద్దేశ్యంతో కేవలం 6వ సెమిస్టర్ రీవాల్యూవేషన్ ఫలితాలను వెల్లడించి చేతులు దూలుపుకోవడంపై విద్యార్థుల నుంచి విమర్శలు వెల్లువెత్తున్నాయి.

వారం రోజుల్లో ఫలితాలను వెల్లడిస్తాం..

ప్రొఫెసర్ శ్రీరామోజు నరసింహచారి, కేయూ పరీక్షల నియంత్రణాధికారి

వారం రోజుల్లో డిగ్రీ సెమిస్టర్ రీవాల్యూవేషన్ ఫలితాలను విడుదల చేస్తాం. రీవాల్యూవేషన్ ప్రాసెస్ పూర్తి చేసి ఫలితాలను విడుదల చేసే ఏర్పాట్లు చేస్తున్నాం. విద్యార్థులు ఎలాంటి ఇబ్బందులకు గురికావద్దు. వీలైనంత త్వరగా ఫలితాలను విడుదల చేస్తాం.

విద్యుదాఘాతంతో రైతు మృతి


మృతి చెందిన భాస్కర్

నర్మెట, జూలై 29 : మండలంలోని హన్మంతాపూర్ గ్రామ శివారు తెట్టేకుంటతండాలో ఓ రైతు విద్యుదాఘాతంతో మృతి చెందాడు. భూక్య భాస్కర్(35) అనే రైతు సోమవారం తన పొలంలో గడ్డి మందు పిచికారి చేస్తుండగా విద్యుత్ స్తంభం నుంచి బోర్ మోటర్‌కు కనెక్ట్ అయి ఉన్న సర్వీస్ వైరు అతడి మెడకు తగిలింది. కిందికి వేలాడుతున్న వైరును గమనించకపోవడం, అది పేలిపోయి ఉండడంతో షాక్‌తో తను అక్కడికక్కడే మృతి చెందాడు. అతడికి భార్య స్వర్ణ, కుమారుడు, కూతురు ఉన్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బైక్ నుంచి పడి ఒకరికి గాయాలు

చిలుపూర్, జూలై 29 : బైక్‌పై వెళ్తున్న ఓ వ్యక్తిని కుక్క వెంబడించడంతో అదుపుతప్పి కిందపడిపోయాడు. తీగలతండాకు చెందిన నారబోయిన రాజు సోమవారం చిన్నపెండ్యాలకు వెళ్తుండగా రాజవరం సమీపంలో ఎల్లమ్మగుడి ఎదురుగా ఓ కుక్క వెంబడించి పాదంపై కరచింది. అనుకోని ఘటనతో తను భయాందోళన చెంది కిందపడ్డాడు. దీంతో అతడి మోకాలుకు గాయమైంది. చికిత్స నిమిత్తం స్థానికులు స్టేషన్‌ఘన్‌పూర్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

దుర్గామాత ఆలయంలో చోరీ

బచ్చన్నపేట, జూలై 29: మండలంలోని వంగ సుదర్శన్‌రెడ్డినగర్ గ్రామ దుర్గామాత ఆలయంలో ఆదివారం రాత్రి చోరీ జరిగింది. గుర్తు తెలియని దుండగులు ఆలయం తాళం పగులకొట్టి అమ్మవారి అరతులం బంగారు ఆభరణం, తాత్కాలికంగా ఏర్పాటు చేసుకున్న హుండీని ఎత్తుకెళ్లారు. ఎస్ఐ సతీష్ సంఘటనా స్థలానికి చేరుకుని విచారణ జరిపారు. ఆలయాల్లో చోరీ ముఠాలు మళ్లీ సంచరిస్తుండడంతో ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

బదిలీపై వెళ్లిన కానిస్టేబుళ్లకు సన్మానం

బచ్చన్నపేట, జూలై 29: బచ్చన్నపేట పోలీస్‌స్టేషన్ నుంచి బదిలీపై వెళ్లిన హెడ్ కానిస్టేబుల్ రాజు, కానిస్టేబుల్‌ళ్లు నగేష్, దీపక్, క్రాంతిలను పోలీస్ సిబ్బందితో పాటు పలు పార్టీల నాయకులు సన్మానించారు. విధి నిర్వహణలో చిత్తశుద్ధి చూపేవారు ఎక్కడికి వెళ్లినా ప్రజల మన్ననలు పొందుతారని అన్నారు.

కిసాన్ మోర్చా అధ్యక్షుడికి పరామర్శ

చిలుపూర్, జూలై 29: కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న బీజేపీ కిసాన్ మోర్చా మండలాధ్యక్షుడు పిట్టల రమేష్‌ను ఆ పార్టీ మండలాధ్యక్షుడు గంటె ఉపేందర్ యాదవ్ పరామర్శించారు. సోమవారం స్థానిక నాయకులతో కలిసి చిలుపూర్‌లో రమేష్ ఇంటికి వెళ్లి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట పెండ్యాల దిలీప్, వెలిశాల శ్రీనివాస్, తోట శ్రీనివాస్, ముక్కెర శ్రవన్, తోట రంజిత్, శైలేష్, దామెర ప్రశాంత్ తదితరులు ఉన్నారు.

హాస్టళ్లలో వసతులు కల్పించాలి: ఎస్ఎఫ్ఐ

స్టేషన్‌ఘన్‌పూర్, జూలై 29: డివిజన్ కేంద్రంలోని హస్టళ్లలో మౌలిక సదుపాయాలు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని, సంబంధిత అధికారులు వెంటనే స్పందించి వసతులు కల్పించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షురాలు దాసగాని సుమ కోరారు. సోమవారం డివిజన్ కేంద్రంలోని పలు వసతి గృహాలను ఎస్ఎఫ్ఐ నాయకులు సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేజీబీవీలో విద్యార్థులకు మెడికల్ కిట్లు లేవని, దుప్పట్లు, బెడ్ షీట్స్ లేక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఇటీవల జిల్లా నాయకులపై పెట్టిన కేసులను వెంటనే ఎత్తివేసి ఎస్సై శ్వేతపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు ఆర్య, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ నూతన కమిటీ ఎన్నిక


కిషన్ రాజు, అధ్యక్షుడు

స్టేషన్‌ఘన్‌పూర్ టౌన్, జూలై 29: స్టేషన్‌ఘన్‌పూర్ లయన్స్ క్లబ్ నూతన కమిటీ అధ్యక్షుడిగా డాక్టర్ ఎ.కిషన్ రాజు, కార్యదర్శిగా విజయ్‌చందర్, కోశాధికారిగా మామిడాల వెంకటేశ్వర్లు ఎన్నికయ్యారు. వీరు ఈ నెల 30న ప్రమాణ స్వీకారం చేస్తారని ప్రోగ్రాం చైర్మన్ గట్టు రమేశ్ తెలిపారు. స్టేషన్ ఘన్‌పూర్‌లో నూతనంగా నిర్మించిన లయన్స్ భవన్‌లో రాత్రి 7 గంటలకు నిర్వహించే 30వ చార్టర్ నైట్, 31వ ఇన్‌స్టలేషన్ కార్యక్రమంలో నూతన కమిటీతో లయన్స్ జిల్లా గవర్నర్ ఎన్. వెంకటేశ్వర్‌రావు, వీడీజీ డాక్టర్ కె.చంద్రశేఖర్ ఆర్య ముఖ్య అతిథులుగా పాల్గొని ప్రమాణ స్వీకారం చేయిస్తారని తెలిపారు.

కాంగ్రెస్ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడిగా మహేందర్


నియామక పత్రం ఇస్తున్న కార్పొరేషన్ చైర్మన్ ప్రీతం

జనగామ రూరల్, జూలై 29: కాంగ్రెస్ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడిగా గనిపాక మహేందర్‌ను నియమిస్తూ రాష్ట్ర ఎస్సీ సెల్ అధ్యక్షుడు, ఎస్సీ సెల్ కార్పొరేషన్ చైర్మన్ నాగరిగారి ప్రీతం సోమవారం నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా మహేందర్ మాట్లాడుతూ రానున్న జీపీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపు కోసం పని చేస్తానని అన్నారు.

ఎస్ఎఫ్ఐ నాయకులపై కేసులు ఎత్తివేయాలి

- రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేసిన నాయకులు



జనగామలో రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

జనగామ రూరల్, జూలై 29: ఎస్ఎఫ్ఐ నాయకులపై అక్రమంగా పెట్టిన కేసులను బేషరతుగా ఎత్తివేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి దుంపల విఘ్నేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం జిల్లా కేంద్రంలోని నెహ్రూపార్కు వద్ద రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా విఘ్నేష్ మాట్లాడుతూ రాష్ట్ర బడ్జెట్‌లో విద్యారంగానికి తక్కువ నిధులు కేటాయించారని నిరసన తెలిపినందుకు ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు సందీప్, ధర్మబిక్షంలపై కక్షపూరితంగా కేసులు పెట్టడం సిగ్గుచేటు అన్నారు. తక్షణమే వాటిని ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సూర్య, మహేష్, అఖిల్, అంకుష్ తదితరులు పాల్గొన్నారు.

జఫర్‌గడ్: ఎస్ఎఫ్ఐ నాయకులపై పెట్టిన కేసులను ఎత్తివేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం మండల కేంద్రంలో ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ తన మేనిఫెస్టోలో 15శాతం నిధులు విద్యారంగానికి కేటాయిస్తామని చెప్పి, 7.3శాతం మాత్రమే కేటాయించారని, ఈ విషయంపై ప్రశ్నించినందుకు కేసులు నమోదు చేయడం సరికాదని అన్నారు. కార్యక్రమంలో యాకన్న రాథోడ్, అర్జున్, శ్రీకాంత్, ఇందు, ఆర్య, ఈశ్వర్, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

బచ్చన్నపేట: ఎస్ఎఫ్ఐ నాయకులపై అన్యాయంగా కేసు నమోదు చేసినందుకు నిరసనగా మండలకేంద్రంలో సోమవారం రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. బేషరతుగా కేసులను ఉపసంహరించుకోవాలని, బాధ్యులైన పోలీసులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు అఖిల్, ఉదయ్, ప్రశాంత్, ముఖేష్, సాగర్ చరణ్‌తేజ్, అక్షయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ సేవలు ప్రశంసనీయం


పాలకుర్తిలో మాట్లాడుతున్న లయన్ డాక్టర్ రాజేందర్‌రెడ్డి

పాలకుర్తి, జూలై 29 : మండలంలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో చేపడుతున్న పలు కార్యక్రమాలు భేషుగ్గా ఉన్నాయని ఆ క్లబ్ మాజీ గవర్నర్ డాక్టర్ రాజేందర్‌రెడ్డి కొనియాడారు. ఆదివారం రాత్రి మండల కేంద్రంలోని సోమేశ్వర ఫంక్షన్ హాలులో ఏర్పాటు చేసిన క్లబ్ నూతన కమిటీ ఎన్నిక సందర్భంగా ముఖ్యఅతిథిగా రాజేందర్‌రెడ్డి హాజరై మాట్లాడుతూ బడుగు, బలహీనవర్గాల సంక్షేమం కోసం పని చేస్తే ప్రత్యేక గుర్తింపు లభిస్తుందన్నారు. 2001లో పాలకుర్తిలో లయన్స్ క్లబ్‌ను ఏర్పాటు చేసినట్లు గుర్తు చేశారు. ఆనాడు కొడకండ్ల మార్కెట్ మాజీ చైర్మన్ ఎర్రబెల్లి రాఘవరావు క్లబ్‌ను అభివృద్ధి పరిచారని అన్నారు. సమాజ సేవ చేస్తేనే క్లబ్‌తో పాటు బాధ్యులకు గుర్తింపు ఉంటుందని అన్నారు. అనంతరం పాలకుర్తి నూతన క్లబ్ కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మాచెర్ల పుల్లయ్య, కార్యదర్శిగా చిదురాల మహేందర్, కోశాధికారిగా పబ్బ సంతోష్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా పుల్లయ్య మాట్లాడుతూ జిల్లాలో ఇతర క్లబ్‌లతో పోటీపడీ పని చేస్తానని అన్నారు.

కార్యక్రమంలో డాక్టర్ లవకుమార్‌రెడ్డి, తమ్మెర నర్సింహులు, హబీబ్, కల్వల భాస్కర్‌రెడ్డి, ఎర్రబెల్లి రాఘవరావు, డాక్టర్ మంద బుచ్చిరెడ్డి, జైపాల్‌రెడ్డి, రాపాక విజయ్, విజయ్, వర్రె వెంకన్న, పోగు శ్రీనివాస్, సోమేశ్వర్, చారగొండ్ల ప్రసాద్, శీల చంద్రశేఖర్, వెంకటేశ్వరావు, అబ్బాస్ అలీ పాల్గొన్నారు.

షూటింగ్‌బాల్ క్రీడను విస్తరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న అసోసియేషన్ చైర్మన్ యుగేంధర్ రెడ్డి

స్టేషన్‌ఘన్‌పూర్, జూలై 29: గ్రామీణ ప్రాంతాల్లో క్రీడాకారులకు కొదువ ఉండదని షూటింగ్‌బాల్ క్రీడను ప్రతీ పల్లెకు విస్తరించి క్రీడాకారులను ప్రోత్సహించాలని, పథకాలు సాధించి జిల్లాకు పేరు తీసుకురావాలని షూటింగ్‌బాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఇనుగాల యుగేందర్ రెడ్డి సూచించారు. సోమవారం డివిజన్ కేంద్రంలో జరిగిన అసోసియేషన్ సమావేశంలో అయన మాట్లాడారు. గ్రామాలలో క్రీడల పట్ల ఆసక్తి కలిగిన క్రీడాకారులు ఎంతో మంది ఉన్నారని, అలాంటి వారిని గుర్తించి వారికి షూటింగ్‌బాల్ క్రీడలో తర్ఫీదు ఇవ్వాలని, రాష్ట్రస్థాయి, జాతీయస్థాయి క్రీడాకారులను తయారు చేయాల్సిన అవసరం ఉందని అన్నారు. ఇప్పటికే జిల్లా నుంచి జూనియర్, సబ్ జూనియర్, సీనియర్ విభాగాల్లో క్రీడాకారులు పథకాలు సాధించారని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా క్రీడను అభివృద్ధి చేయడానికి త్వరలో ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో అసోసియన్ అధ్యక్షుడు మంద రమేష్, ఉపాధ్యక్షుడు బొజ్జపల్లి సుభాష్, పురమాని రజాక్‌యాదవ్, భూక్య సుధాకర్‌నాయక్, అన్నెపు కుమార్, పీఈటీలు ఎన్.చందర్, సీహెచ్ సుధాకర్, దిలీప్‌కుమార్, రాజన్న, అజయ్, సాఫీర్, రమేష్, జి. గంగాధర్ రెడ్డి, గణేష్, మధు పాల్గొన్నారు.

పాఠశాల చుట్టూ చెట్లపొదల తొలగింపు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్


పిచ్చి చెట్లను తొలగిస్తున్న జీపీ సిబ్బంది

బచ్చన్నపేట, జూలై 29: కస్తూర్బా గాంధీ విద్యాలయం ప్రహరీ పక్కన పిచ్చి చెట్లు పెరిగిపోయి మురుగు నీరు నిలువడంతో సోమవారం 'ఆంధ్రజ్యోతి'లో 'పాఠశాల చుట్టూ కానరాని పరిశుభ్రత' పేరుతో వార్త ప్రచురితమయ్యింది. దీనికి స్పందించిన స్పెషల్ ఆఫీసర్ వినోద్‌కుమార్, ఎంపీడీవో రఘురామకృష్ణ వెంటనే శుభ్రం చేయించాలని గోపాల్‌నగర్ పంచాయతీ కార్యదర్శి కవితను ఆదేశించారు. దీంతో మంగళవారం జీపీ సిబ్బందితో పాటు డోజర్ సహాయంతో ఏపుగా పెరిగిన పిచ్చి చెట్లను తొలగించారు. మురికి గుంటలను పూడ్చారు. మురుగునీరు నిలువ ఉండకుండా ఉండాలంటే తీసుకోవాల్సిన చర్యలపై అధికారులను కలిసి వివరించనున్నట్టు కవిత తెలిపారు. పాఠశాల ఆవరణలో పెద్ద ఎత్తున మురుగునీరు నిలిచిపోయి దుర్గంధం వెదజల్లుతున్నా పాఠశాలకు సంబంధించిన బాధ్యులెవరూ పట్టించుకోవటం లేదంటూ ఇందిరానగర్, గోపాల్‌నగర్‌లకు చెందిన పలువురు అధికారుల దృష్టికి తీసుకువచ్చారు.


డోజర్ సహాయంతో గుంతలు పూడుస్తున్న దృశ్యం

నాణ్యతను గోదారిలో కలిపారు

టీపీసీసీ అధికార ప్రతినిధి మొగుళ్ల రాజిరెడ్డి

బచ్చన్నపేట, జూలై 29: బీఆర్ఎస్ నేతలు కమీషన్లకు కక్కుర్తిపడి నాణ్యతను గోదారిలో కలపడం మూలంగానే మేడిగడ్డ బ్యారేజీకి పగుళ్లు వచ్చాయని, అయినప్పటికీ మాజీ మంత్రులు హరీష్‌రావు, కేటీఆర్‌లు కాంగ్రెస్ వారే కుట్ర చేసి ఉంటారని మాట్లాడటం సిగ్గుచేటని టీపీసీసీ అధికార ప్రతినిధి మొగుళ్ల రాజిరెడ్డి విమర్శించారు. సోమవారం ఆయన మండల కేంద్రంలో మాట్లాడుతూ వారి తప్పులు కప్పిపుచ్చుకునేందుకు కాంగ్రెస్ పార్టీపై బురద జల్లే పనులు చేస్తున్నారని మండిపడ్డారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో రాష్ట్రం దివాళా తీసిందని ఆరోపించారు.

దురలవాట్లకు దూరంగా ఉండాలి


యువకులకు ఎల్ఈడీ లైట్లు అందజేస్తున్న ఎస్సై రాజు

లింగాలఘణపురం, జూలై 29: యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని లింగాలఘణపురం ఎస్సై చింత రాజు అన్నారు. సోమవారం లింగాలఘణపురం మండల కేంద్రానికి చెందిన యువకులు షటిల్ ఆడేందుకు ఎల్ఈడీ ఫోకస్ లైట్ కోసం విజ్ఞప్తి చేయగా వెంటనే స్పందించిన ఎస్సై రూ. 3వేల విలువైన ఎల్ఈడీ లైట్‌ను ఇప్పించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ యువకులు చెడువ్యసనాల జోలికి వెళ్లకుండా క్రీడలపై దృష్టిసారించాలని సూచించారు. తద్వారా ఆరోగ్యం మెరుగుపడుతుందని, శారీరక ధృఢత్వం పెరుగుతుందని అన్నారు. కార్యక్రమంలో కానిస్టేబుల్ రాజేశ్, యువకులు మల్లేశం, నరేశ్, మహెందర్, మహేశ్, ప్రవీణ్, జగన్ సిద్ధు పాల్గొన్నారు.

'సమస్యలను పరిష్కరించాలి'

జనగామ రూరల్, జూలై 29: రాష్ట్ర ప్రభుత్వం కల్లుగీత కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని సంఘం రాష్ట్ర కార్యదర్శి బూడిద గోపి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని ప్రజా సంఘాల కార్యాలయంలో సోమవారం కేజీకేఎస్ నాయకులు అమరుల యాదిలో గీతన్నల చైతన్య యాత్ర పోస్టర్లను అవిష్కరించారు. ఈ సందర్భంగా గోపి మాట్లాడుతూ తెలంగాణలో 5 లక్షల కుటుంబాలు కల్లుగీత వృత్తి మీదనే అధారపడి జీవనాన్ని కొనసాగిస్తున్నారని, వారి సంక్షేమం కోసం ప్రభుత్వం రూ. 5వేల కోట్లు బడ్జెట్‌లో కేటాయించాలని డిమాండ్ చేశారు. జనగామ జిల్లాకు సర్ధార్ సర్వాయి పాపన్న నామకరణం చేయాలని కోరారు. ఆగస్టు 2 నుంచి 18 వరకు అమరుల యాదిలో గీతన్నల చైతన్య యాత్ర పేరుతో జిల్లాలో బైక్ ర్యాలీలు నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో బాల్నె వెంకట మల్లయ్య, జోన్నగొని శ్రీనివాస్, వెంకటేష్, మహేందర్, తదితరులు పాల్గొన్నారు.

పద్మశాలీలు ఐక్యంగా ఉద్యమించాలి

చేనేత ఐక్యవేదిక ఇన్‌చార్జి గజ్జెల దామోదర్

చిలుపూర్, జూలై 29 : పద్మశాలీలు ఐక్యంగా ఉద్యమించి వారి సమస్యలను పరిష్కరించుకోవాలని చేనేత ఐక్యవేదిక నియోజకవర్గ ఇన్‌చార్జి, పద్మశాలి సంఘం మండలాధ్యక్షుడు గజ్జెల దామోదర్ అన్నారు. సోమవారం హైదరాబాద్‌లో నిర్వహించే రాష్ట్ర కమిటీ సమావేశానికి మండలంలోని చిన్నపెండ్యాల, మల్కాపూర్, రాజవరం, కృష్ణాజీగూడెం, పల్లగుట్ట తదితర గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో సంఘం ప్రతినిధులు తరలివెళ్లారు. ఈ సందర్భంగా గజ్జెల దామోదర్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా పద్మశాలీలకు తగిన గుర్తింపునివ్వడంతో పాటు, అర్హులైన ప్రతీ ఒక్కరికి డబుల్ బెడ్రూం ఇండ్లు మంజూరు చేయాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాల్లో ప్రత్యేక కోటా కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు పేరాల సుధాకర్, బండారి రాజ్‌కుమార్, పేరాల నాగభూషన్, వేముల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

పార్టీ బలోపేతమే లక్ష్యంగా పని చేయాలి

బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి శివరాజ్ యాదవ్


నర్మెటలో జెండా ఆవిష్కరిస్తున్న బీజేపీ నాయకులు

నర్మెట, జూలై 29: మండలంలో భారతీయ జనతా పార్టీ బలోపేతమే లక్ష్యంగా కార్యకర్తలు పని చేయాలని పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి శివరాజ్ యాదవ్ పిలుపునిచ్చారు. సోమవారం నర్మెట మండలకేంద్రంలో నిర్వహించిన కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. మొదటగా బీజేపీ జెండాను ఆవిష్కరించారు. పార్టీ సంస్థాగత నిర్మాణం ఏ విధంగా చేయాలో మార్గనిర్దేశం చేశారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీని గెలిపించే విధంగా కార్యకర్తలు విస్తృతంగా కృషి చేయాలని అన్నారు. అనంతరం నర్మెట మండల నూతన ఎస్సైగా బాధ్యతలు చేపట్టిన నగేష్‌ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. బీజేపీ మండల అధ్యక్షుడు ధరావత్ రాజు అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో నాయకులు సొక్కం అనిల్, ధరావత్ శ్రీను, బైరగోని ఆంజనేయులు, రాజబోయిన శ్రీనివాస్, చెవుల రాజు, కొన్నె రాజు, మెతుకు సిద్దులు, బుచ్చాల కొమురెల్లి, ప్రభాకర్ పాల్గొన్నారు.

రైతులకు హైటెన్షన్

ట్రాన్స్‌ఫార్మర్‌ను మరో చోటికి మార్చాలని కోరుతున్న అన్నదాతలు


హైటెన్షన్ విద్యుత్ టవర్ పక్కన ప్రమాదకరంగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్

స్టేషన్‌ఘన్‌పూర్, జూలై 29: మండలంలోని పాంనూర్ గ్రామ శివారులో నూతనంగా ఏర్పాటు చేసిన 220 కేవీ హైటెన్షన్ విద్యుత్ టవర్ స్థానిక రైతులకు టెన్షన్ పెడుతోంది. పక్కనే వ్యవసాయబావులకు విద్యుత్ అందించే ట్రాన్స్‌ఫార్మర్ ఉండడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని వారు ఆందోళన చెందుతున్నారు. అంతేగాకుండా హైటెన్షన్ లైన్ వల్ల విద్యుత్ ప్రవాహ తీవ్రత ఎక్కువై మోటర్లు తరుచుగా కాలిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిబంధనల ప్రకారం వ్యవసాయ బావులకు సంబంధించిన, గృహ అవసరాలకు వినియోగించే ట్రాన్స్‌పార్మర్‌లు హైటెన్షన్ విద్యుత్ లైన్లకు కనీసం 60 అడుగుల దూరంలో ఉండాలి. అంతకంటే తక్కువ దూరంలో ఉన్నట్లైతే విద్యుత్ సరఫరా జరిగి ప్రమాదాలు చోటు చేసుకునే అవకాశాలు ఉంటాయి. ట్రాన్స్‌కో అధికారులు టవర్స్ లైన్ వేసినప్పటికి స్థానికంగా ఉండే విద్యుత్ అధికారులు ట్రాన్స్‌ఫార్మర్స్‌ను హైటెన్షన్ లైన్లకు దూరంగా ఏర్పాటు చేసి సురక్షితమైన విద్యుత్‌ను అందించాల్సి ఉంటుంది. కాని 6 నెలలు గడుస్తున్నా వాటిని పట్టించుకున్నవారు లేరు. అదేవిధంగా పొలాల మీదుగా ఉన్నటువంటి 11కేవీ విద్యుత్ స్తంభాలు ఒక వైపు ఒరిగి ప్రమాదకరంగా ఉన్నాయి. అవి ఎప్పుడు పడిపోతాయోనని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా అధికారులు వాటిని సరిచేయాలని కోరుతున్నారు.


పాంనూర్‌లో వంగి ఉన్న స్తంభం

ప్రహరీ కూలి మూడేళ్లు..

నిర్మాణానికి ఇంకెన్నేళ్లు?

అధ్వాన స్థితిలో బాలికల గురుకుల పాఠశాల


పాలకుర్తిలో బాలికల గురుకుల పాఠశాల ప్రహరీ కూలిన దృశ్యం

పాలకుర్తి, జూలై 29: నియోజకవర్గ కేంద్రంలో గల సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల ప్రహరీ కూలిపోయి మూడేళ్లవుతోంది. అప్పుడు కురిసిన భారీ వర్షాలకు ప్రహరీ సుమారు 40 మీటర్ల మేర కూలిపోయింది. అన్ని శాఖల అధికారులు కూడా ఈ పాఠశాల ముందు నుంచే వెళుతున్నారే తప్ప దానిని నిర్మించాలనే ఉద్దేశం ఎవరికీ రావడంలేదు. దీంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. గ్రామానికి దూరంగా పాఠశాల ఉన్నప్పటికీ పందులు, కుక్కలతో పాటు క్రిమి కీటకాలు వస్తున్నాయని ఆందోళన చెందుతున్నారు. ఏళ్లు గడుస్తున్నప్పటికీ అధికారులు పట్టించుకోవడంలేదని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. ఈ పాఠశాల/కళాశాలలో 5వ తరగతి నుంచి ఇంటర్ వరకు మొత్తం 640 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. 24 మంది ఉపాధ్యాయులు, నాన్ టీచింగ్ వర్కర్లు 10 మంది మొత్తం 34 మంది విధులు నిర్వహిస్తున్నారు. ఇప్పటికైనా పాఠశాలకు ప్రహరీ నిర్మించాలని కలెక్టర్‌ను గ్రామస్థులు కోరుతున్నారు.

ప్రజా ఉద్యమాల్లో బొల్లం దాసు పాత్ర కీలకం

సీపీఎం జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి


బొల్లం దాసు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

జనగామ రూరల్, జూలై 29: ప్రజా ఉద్యమాలలో బొల్లం దాసు చురుకైన పాత్ర పోషించేవారని సీపీఎం జిల్లా కార్యదర్శి మోకు కనుకరెడ్డి అన్నారు. సీపీఎం నాయకుడు బొల్లం దాసు ప్రథమ వర్ధంతి సందర్భంగా జిల్లా కేంద్రంలో సోమవారం సీపీఎం నాయకులు ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కనుకారెడ్డి మాట్లాడుతూ దాసు సీపీఎం సిద్ధాంతానికి కట్టుబడి ఉంటూ తనదైన శైలిలో ప్రజలకు సేవలు అందించేవాడని కొనియాడారు. కార్యక్రమంలో బొట్ల శ్రీనివాస్, గోపి, విజేందర్, జోగు ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

'ఫ్లై ఓవర్ బ్రిడ్జిపై పెరిగిన చెట్లను తొలగించాలి'

జనగామ రూరల్, జూలై 29: జిల్లా కేంద్రంలోని ఫ్లై ఓవర్ బ్రిడ్జిపై పెరిగిన చెట్లను తొలగించాలని డిమాండ్ చేస్తూ అమ్మ ఫౌండేషన్ టీం సభ్యులు సోమవారం బ్రిడ్జి వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా అమ్మ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంతెన మణి కుమార్ మాట్లాడుతూ మూడు దశాబ్దాల క్రితం నిర్మించిన బ్రిడ్జిపై పగుళ్లు ఏర్పడి పిల్లర్ల వద్ద మొక్కలు పెరుగుతున్నా ఆర్అండ్‌బీ, మున్సిపల్ అధికారులు పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. ఏదైన ప్రమాదం జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారని ప్రశ్నించారు. ఫ్లై ఓవర్‌పై పూల కుండీలు ఉండడం వల్ల పాదచారులు ఫుట్‌పాత్‌లో నడవాలంటే ఇబ్బందులు పడుతున్నారని వెంటనే వాటిని తొలగించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో లకన్ సింగ్, చందు, నగేష్, పవన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా మూల మలుపు

ఆర్అండ్‌బీ అధికారుల నిర్లక్ష్యానికి బలవుతున్న ప్రజలు


జఫర్‌గడ్-ఘన్‌పూర్ రోడ్డుపై ప్రమాదకరంగా ఉన్న మూల మలుపు

స్టేషన్‌ఘన్‌పూర్, జూలై 29: స్టేషన్‌ఘన్‌పూర్ నుంచి జఫర్‌గడ్ వెళ్లేదారిలో మూల మలుపు ప్రమాదకరంగా మారింది. చేనేత కాలనీ దాటిన తర్వాత పూర్తిగా దగ్గరకు వచ్చే వరకు మలుపు ఉందని తెలియకుండా ఉంది. దీంతో తరుచుగా ఇక్కడ ప్రమాదాలు జరుగుతున్నాయి. కొత్తగా రోడ్డు వేసే సమయంలో మలుపును సరిచేసి రోడ్డును సూటిగా వేయాలని ఆర్‌ఆండ్‌బీ అధికారులను కోరినప్పటికీ పట్టించుకోలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. దీంతో ముఖ్యంగా రాత్రి వేళల్లో ప్రమాదాలు జరిగి ప్రజలు బలైపోతున్నారు. బైకులపై వేగంగా వెళ్లేవారు సడన్‌గా మూల మలుపు ఉండడంతో అదుపుతప్పి పడిపోతున్నారు. మూల మలుపును సూటిగా చేయాలని అనేకమార్లు జిల్లా అధికారులకు కోరినా పట్టించుకోవడం లేదని స్థానికులు చెబుతున్నారు. ఇప్పటికైనా పాలకులు స్పందించి మూలమలుపును సరిచేయాలని మండల ప్రజలు వేడుకుంటున్నారు.